నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 20 ఆగస్టు 2024 | www.navatelangana.com

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేష్ జి.సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి

కలకత్తా నగరంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై సభ్య సమాజం తల దించుకునే విధంగా అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేష్ జి.సాయిలు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వైద్య విద్యార్థుల కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇంతటి పాశవిక ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిష్పక్షపాతంగా న్యాయ విచారణ చేసి నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులపై ప్రభుత్వం చేపట్టే చర్యలు మహిళలకు, మెడికల్ కాలేజీ విద్యార్థులకు ధైర్యాన్ని నింపే విధంగా ఉండాలన్నారు. దేశ ప్రజలకు ధైర్యాన్ని, భరోసాని కల్పించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా ఫోటోగ్రాఫర్స్ డే



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రపంచ ఫోటో గ్రాఫర్స్ డే సందర్భంగా సంగారెడ్డి మండల ఫోటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాలాజి సతీష్ ప్రధాన కార్యదర్శి భూమయ్య, క్యాషియర్ మురళీ, సభ్యులు యాదగిరి, అంజనేయులు, రాజు, భవాని లక్ష్మన్, భరత్ ,రవికాంత్,అజయ్, జిల్లా అధ్యక్షులు సుప్పల, శ్రీనివాస్, ల్యాబ్ ప్రభాన్న , మహేశ్వరప్ప, గోపాలన్న, నర్సింలు, రాజేష్, అను సురేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి

- రైతుసంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు
- జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహా రావుకి వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు రుణమాఫీ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పి రేషన్ కార్డు పరిగణలోకి తీసుకోవడంతో అనేకమంది రైతులకు రుణమాఫీ రాలేదన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్, పట్టాపాస్ బుక్‌లో తప్పులు ఉన్న రైతుకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. టెక్నికల్ సమస్యను దృష్టిలో పెట్టుకొని రుణమాఫీ చేయకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే వాటిని సరి చేసి రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, నాయకులు మాణిక్ రెడ్డి, మల్లారెడ్డి, జైపాల్ రెడ్డి, రైతులు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ గౌడ్, మల్లేశం, రాములు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పరిష్కారానికి మండలానికో నోడల్ అధికారి

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం 2024 కోసం ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు తెలిపారు. మూడు విడతలలో జరిగిన రుణమాఫీలో ఫిర్యాదులు నమోదు, పరిష్కారానికి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు . జిల్లాలోని 27 మండలాలకు, మండల వ్యవసాయ అధికారులను, ఆయా మండలాలకు నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు లేని మండలాలకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. మండల స్థాయిలో, మండల వ్యవసాయ అధికారి ఏఈవోలు, రైతుల ఫిర్యాదులను నమోదు చేయడం, పంట రుణాల పంపిణీ పూర్తయ్యేవరకు వాటి పరిష్కారానికి సంబంధించి వారికి కేటాయించిన, మండలాలకు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. వారు సాధారణ విధులతో పాటు, రుణమాఫీ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మండల కేంద్రాలలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నోడల్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరించి నోడల్ అధికారులు మండలాల్లో ఉన్న అన్ని బ్యాంకు శాఖలు పిఎసిఎస్‌లకు బాధ్యత వహించాలన్నారు. ఫిర్యాదులను అన్ని డాక్యుమెంట్లతో రికార్డు చేయాలని ఆదేశించారు . సంబంధిత పోర్టల్‌లో ఫిర్యాదు వివరాలు, సంబంధిత డాక్యుమెంట్ల వివరాలు నమోదు చేయాలన్నారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నోడల్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతుందన్నారు. ఆయా మండలాలలోని బ్యాంకులో సహకార సంఘాల నుంచి అధికారులు వివరాలు తీసుకొని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. బ్యాంకర్ల వల్ల జరిగిన తప్పిదాలు, కుటుంబ నిర్ధారణ జరగనివి, మిస్సింగ్ డాటా, పంట రుణమాఫీ వచ్చి వెనుదిరిగిన రైతులు. మొదలైన ఫిర్యాదులపై, జిల్లాలోని పంట రుణమాఫీ అర్హత కలిగిన రైతులు నోడల్ అధికారులకు తగిన పత్రాలు సమర్పించి పంట రుణమాఫీని పొందాలని నర్సింహరావు సూచించారు.

కోల్‌కత్తా ఘటనలో దుండగులను ఉరితీయాలి



నవతెలంగాణ-జిన్నారం

కోల్‌కత్తా ఘటనలో దుండగులను ఉరతీయాలని జిన్నారం మండలానికి చెందిన పలువురు మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మహిళా సంఘం నేతలు నీలం శ్రీలత, గొల్లగూడెం శారద, శశికళ, ఎందని కస్తూరి, గుమ్మడిదల మానసప్రియలు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న మహిళపై దుండగులు దాష్టీకానికి ఒడిగట్టడం అమానవీయ చర్యకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇలాంటి అకృత్యాలు చోటు చేసుకుంటుంటే ఆడపిల్లలకు రక్షణ కరువైపోతుందన్న ఆందోళన పెరిగిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కత్తా ఘటనలాంటివి చోటు చేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చర్యలను మరింత పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం రూ.50 లక్షల ల ఆర్థిక సాయం అందించాలని వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దుండగులను శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న అత్యాచారాల ఘటనలు సభ్య సమాజానికి సిగ్గుచేటుగా పరిణమిస్తున్నాయంటూ మహిళా సంఘాల నేతలు నీలం శ్రీలత, గొల్లగూడెం శారద, శశికళ, ఎందని కస్తూరి, గుమ్మడిదల మానసప్రియ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

నర్సంపల్లిలో ఓ మహిళ అదృశ్యం



నవతెలంగాణ-తూప్రాన్

మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన తుడుం మరియమ్మ అలియాస్ పెంటమ్మ సోమవారం అదృశ్యమైంది. భర్త కరుణాకర్‌తో కుటుంబ విషయంలో గొడవపడి, భర్తపై అలిగి మరియమ్మ తల్లిగారిల్లు అయిన నర్సంపల్లి గ్రామానికి వచ్చింది. తల్లిగారి ఇంట్లో పది రోజుల వరకు ఉండి, ఆగస్టు 15న రాత్రి సుమారు 11 గంటలకు ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయిందని ఆమె సోదరుడు తునికి హనుమంతు బావ కరుణాకర్‌కు సమాచారం అందించాడు. ఆ తర్వాత చుట్టుపక్కల ప్రాంతాలలో, బంధువుల ఇండ్లలో ఎంత వెతికిన మరియమ్మ ఆచూకీ లభించలేదు. మరియమ్మ భర్త తుడుం కర్ణాకర్ ఫిర్యాదు మేరకుం తూప్రాన్ ఎస్ఐ శివానంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చాయ్ చస్కాపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని సింగూరు క్రాస్ రోడ్డు వద్ద కనీస వసతులు కల్పించకుండా ఏర్పాటు చేసిన చాయ్ చస్కాపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రజల తాకిడి ఎక్కువ కావడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు అనుకూలంగా కనీస మౌలిక వసతులు కల్పించడంలో హెూటల్ యజమాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతేకాకుండా హెూటల్ ద్వారా వచ్చే వ్యర్థ పదార్థాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా తమ హెూటల్ పక్కనే జాతీయ రహదారిపై వేయడంతో దాని దుర్వాసన భరించలేక కొందరు కస్టమర్లు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికైనా వచ్చిన కస్టమర్లకు వారికి కావాల్సిన కనీస మౌలిక వసతులు కల్పించాలని హెూటల్‌కు వచ్చే వారు కోరుతున్నారు.

హైడ్రాతో... ఆక్రమణలు ఆగేనా



- కబ్జా పాలైన అమీన్‌పూర్ పెద్ద చెర్వు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, శిఖం, కాల్వల్లో నిర్మాణాలు
- 2016లో బయోడైవర్సిటి హెరిటేజ్‌సైట్‌గా గుర్తింపు
- నేడు కనిపించని జీవవైవిధ్య ఆనవాళ్లు
- ఆక్రమణలపై దృష్టి సారించిన హైడ్రా కమిషనర్
- జలాశయాలే కాదు ఇతర ప్రభుత్వ భూములపై కేంద్రీకరణ
- గుడ్డిగా అనుమతిలిచ్చిన హెచ్‌ఎండీఏ, పంచాయతీలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

చెర్వులు, కుంటలు, కాల్వ కట్టలే కాదు ప్రభుత్వ భూములన్నీ కబ్జాలు, ఆక్రమణల పాలవుతున్నాయి. ఎంతో విలువైన అవసరమైన భూముల్లో అక్రమంగా నిర్మాణాలు, కట్టడాలు వెలిశాయి. హెచ్‌ఎండీఏ మొదలు పంచాయతీలు, మున్సిపాలిటీలు గుడ్డిగా అనుమతిచ్చాయి. అలాంటి ఆక్రమణల తంతును తేల్చేందుకు రంగంలోకి దిగిన హైడ్రాతోనేనా అమీన్‌పూర్ ఇతర ప్రాంతాల్లో అక్రమణలు ఆగాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగారు. అమీన్‌పూర్ పెద్దచెరువు పరిసరలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు, కట్టడాల్ని పరిశీలించారు. సమగ్ర సర్వే చేసేందుకు ఆదేశించారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్ పరిధిలో జరిగిన నిర్మాణాలను గుర్తించిన హైడ్రా సర్వే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశముంది.

కనిపించని జీవవైవిధ్య ఆనవాళ్లు

ప్రపంచ వ్యాప్తంగా అందమైన పక్షులు వలసొచ్చే జీవవైవిధ్య పెద్ద చెర్వు తన ఆనవాళ్లను కోల్పోయింది. ఆహ్లాదరకమైన వాతావరణం కాస్త అగమైంది. కాలుష్యపు నీరు, వ్యర్థాలతో దుర్గంధమైంది. 1580 కాలంలో నిర్మించబడిన అమీన్‌పూర్ పెద్ద చెర్వుకు ఎంతో చరిత్ర ఉంది. 450 ఎకరాల విస్తీర్ణంలో మూడు తూములు, భారీ కట్టతో నిర్మితమైంది. చెర్వు కింద 1 600 ఎకరాల ఆయకట్టు ఉండేది. ప్రస్తుతం ఆయకట్టంతా బహుల, భారీ అంతస్తుల నిలమయంగా మారింది. చెర్వులో 9 రకాల చేపలు, 166 రకాల పక్షులు, 8 జాతాల క్షరీదాలు, 34 రకాల సరీసృపాలుండే చెర్వు తన వైభవాన్ని కోల్పేయేలా చేశారు. ఒకప్పుడు విదేశీ పర్యటకులు సందర్శించే ప్రాంతం కాస్త ప్రస్తుతం స్థానికులు కూడా కట్టపైన కూర్చు పరిస్థితిలేదు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన పాలకులు చెర్వును ఆగం పట్టించడం తప్ప చేసిందేమీలేదు.

కబ్జాల పాలైన చెర్వు శిఖం

అమీన్‌పూర్ జీవవైవిధ్య పెద్ద చెరువు కబ్జాల పాలైంది. గతంలో పంచాయతీ, ప్రస్తుతం మున్సిపల్, హెచ్‌ఎండీఏ చట్టాల్ని ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలకు అనుమతిచ్చిన పరిస్థితి ఉంది. చెర్వు పరిధిలో శిఖం, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, కాల్వలపై అనేక నిర్మాణాలు వెలిశాయి. భారీ భవంతులు కట్టారు. చెర్వు ఎఫ్‌టీఎల్ పరిధిలో రెండు లేఅవుట్స్‌కు గతంలో హెచ్‌ఎండీఏ అనుమతులు జారీ చేసింది. ఒక్క కాలనీలోనే ఎఫ్‌టీఎల్ పరిధిలో 250 నిర్మాణాలున్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒక బహుళ అంతస్తుకు కూడా అనుమతులిచ్చారు. చెరువులు, కుంటలు, నాలాలు, కాల్వల పరిధిలో ఏలాంటి నిర్మాణాలు చేయకూడదు. కేవలం ఏవైన స్వల్పకాలిక పంటలు సాగు చేసేందుకు మాత్రమే తాత్కాలిక హక్కు కల్పించాలి. కానీ..! పెద్ద చెర్వు చుట్టూ అనేక నిర్మాణాలకు అనుమతివ్వడం వల్ల వాటి ముసుగులో అనేక మంది కబ్జాలకు పాల్పడ్డారు. 993 సర్వే నెంబర్‌లో ఉన్న 65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో వేరే సర్వే నెంబర్లతో డాక్యుమెంట్స్ సృష్టించి 5 వేల గజాల స్థలాన్ని కబ్జా చేసి గోడ కట్టారు. 630, 343 సర్వే నెంబర్లలో కూడా ఆక్రమణలు జరిగాయి. చెరువు, కుంట, కాల్వలు, నాలాల భూములే కాకుండా ఓపెన్ స్థలాలు కూడా వందల ఎకరాలు కబ్జా పాలవుతున్నాయి. ప్రభుత్వ భూమి అని తెలిస్తే చాలు చట్టంలోని లొసుకుల్ని ఆసరా చేసుకుని గ్రామ పంచాయతీ, మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని పలువురు నాయకులు, రియల్టర్లు, బిల్డర్లు కబ్జాలకు పాల్పడ్డారు. గతంలో అధికార పార్టీ అండతో ఆక్రమణలకు పాల్పడ్డ వాళ్లంతా ఇప్పుడు కాంగ్రెస్ పంచన చేరారు. ఈ పరిస్థితుల్లో ఆక్రమణలను కూల్చి చెర్వు భూముల్ని ఏ మేరకు కాపాడుతారో వేచి చూడాలి.

ఒపెన్ స్థలాల్ని కూడా కాపాలి

జలాశయాల పరిధిలోని భూములపైనే కాకుండా ఒపెన్ ల్యాండ్ కూడా కబ్జాకు గురి కాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములున్నాయి. చాలా చోట్ల అసైన్డ్ భూములున్నాయి. దేవాలయ, వక్ఫ్, పోరంబోకు, చెర్వు శిఖం భూములున్నాయి. వాటిని నిషేదిత జాబితాలో చేర్చకుండా కబ్జాకు అవకాశమిచ్చారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు పొంతనలేని పద్ధతుల్లో వ్యవహరిస్తూ ఇష్టానుసారంగా ఆక్రమణలకు అవకాశమించారు.

రంగంలోకి హైడ్రా

చెర్వులు, కుంటలు, నాలాల ఆక్రమణలను నిగ్గుతేల్చేందుకు రంగంలోకి దిగిన హైడ్రా అమీన్‌పూర్ పెద్దచెర్వుపై దృష్టి సారించింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అథారిటీ కమిషనర్ రంగనాథ్ స్వయంగా అమీన్‌పూర్‌చెర్వు పరిధిలో వెలసిన పలు ఆక్రమణలను పరిశీలించారు. హైడ్రా సిబ్బంది కూడా పలు కట్టడాలు, నిర్మాణాలు, చెర్వు పరిధిని పరిశీలించింది. పెద్ద చెర్వు ఆక్రమణలు, కబ్జాలు, చెర్వు తూములు, నీటి ప్రవాహం వంటి విషయాలపై సమగ్ర సర్వే చేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సైతం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సర్వే చేసి సమగ్రమైన రిపోర్టు ఇవ్వాలని ఆదేశించడంతో డ్రోమ్ కెమెరాతో సర్వే ద్వారా తేల్చనున్నారు. రంగనాథ్ దృష్టి కేంద్రీకరించినందున అమీన్‌పూర్ పెద్ద చెర్వుతో పాటు ఇతర చెర్వులు, కుంటలు, నాలాల కబ్జాలపైన కూడా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గజ్వేల్ పాతబస్తీలో ఇండ్లలోకి వర్షం నీరు

- అప్రమత్తమైన మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి కోట మైసమ్మ రోడ్డు మార్గంలో ఉన్న పాత ఇండ్లలోకి భారీగా నీరు చేరింది. రోడ్డు విస్తరణలో సగం ఇల్లు కోల్పోయిన బాధితులు అందులోనే కుటుంబాలు నివసిస్తున్నారు. భారీ వర్షం కురవడంతో ఆదివారం రాత్రి ఆ కుటుంబాలకు బతుకు భారంగా తెల్లారింది. పట్టణానికి చెందిన నారాయణ అనే వృద్ధుడు సగం కూలిపోయిన ఇంటిలోనే ఒంటరిగా జీవిస్తున్నారు. ఆయనకు భార్యాబిడ్డలు లేకపోవడంతో ఆ ఇంటిలోనే ఉంటున్నారు. భారీ వర్షం మూలంగా ఇంటిలోకి వర్షం నీరు చేరి బట్టలు, బియ్యం, ఇతర వస్తువులు పూర్తిగా తడిసి పోయాయి. ఈ విషయం సోషల్ మీడియాలో రాత్రంతా వైరల్‌గా మారింది. దీంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తక్షణమే స్పందించి మున్సిపల్ సిబ్బందిని రంగంలోకి దించారు. 9, 10వ వార్డుల్లో ఉన్న కూలిపోయిన ఇండ్లలో నివసిస్తున్న వారిని అప్రమత్తం చేశారు. అంతే కాకుండా జేసీబీ యంత్రాల ద్వారా నీటిని మరోపక్కకు తరలించారు. వర్షం నీరు నిండిన బస్తీల్లో నీటిని తొలగించి, రాయి పొడిని గుంతల్లో నింపి నీరును బయటికి వెళ్లేలా చేశారు. రాత్రంతా మున్సిపల్ సిబ్బంది రెండు వార్డులోనే వర్షంలోనే తడుస్తూ చర్యలు చేపట్టారు.



అసంపూర్తిగా మురికి కాలువల నిర్మాణం

రోడ్డు, మురికి కాలువల పనుల నిలిపివేతతో భారీ వర్షానికి వర్షం నీరు ఇండ్లలో చేరిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. స్థానిక ఇందిరా పార్క్ నుంచి కోట మైసమ్మ రోడ్డు విస్తరణ పూర్తి కాకపోవడం, ఇరుపక్కల మురికి కాలువలు కేవలం ఎంపీడీఓ కార్యాలయం వరకే పూర్తి అయ్యింది. అక్కడికి వచ్చి మురికి నీరు నిలుస్తుంది. ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నిధులు లేవని చెబుతున్నారు తప్ప తాత్కాలిక చర్యలు చేపట్టడం లేదు. ఆదివారం రాత్రి కురిసిన కుంభ వర్షానికి పాతబస్తీ పూర్తిగా జలదిగ్బంధంగా మారటానికి రోడ్డు విస్తరణ పూర్తి కాకపోవడమేనని స్థానికులు భావిస్తున్నారు. మురికి కాలువలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు పట్టించుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వృద్ధుడిని ఆదుకున్న అరవింద్

రాత్రంతా కురిసిన భారీ వర్షానికి సగం కూలిపోయిన ఇంటిలో ఉన్న వృద్ధుడి వీడియోను బీజేపీ నాయకులు బారు అరవింద్ సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అంతేకాకుండా వృద్ధుడు నారాయణకు భోజనం తీసుకొచ్చి తినబెట్టారు. తనకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు అయిందని వృద్ధుడు చెప్పారు. గత పదేళ్లుగా శిధిలావస్థమైన ఇంటిలోనే ఉంటున్నానని చెప్పారు. ఓట్లకొచ్చినప్పుడు చెప్పిన పట్టించుకోలేదని ఆయన ఆవేదన చెందారు. సమీప బంధువుల ఫోన్ నెంబర్లు తీసుకొని అరవిందు వారికి సమాచారం అందించారు. అప్పటికే నారాయణ జ్వరంతోనే బాధపడుతున్నట్లు సమీప బంధువులు తెలిపారు.

త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం భూ బదలాయింపు

- మరోచోట అటవి ప్రాంతానికి భూమి కేటాయింపు



నవతెలంగాణ-గజ్వేల్

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని త్రిబుల్ ఆర్ భూసేకరణలో భాగంగా అటవీ ప్రాంతం గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, తూప్రాన్ మండలాలతోపాటు నర్సాపూర్, సంగారెడ్డి, యాదాద్రి, ప్రాంతాల్లో అటవీ శాఖ భూముల నుంచి త్రిబుల్ ఆర్ రోడ్డు వెళుతున్నందున భూ బదలాయింపు జరగాలని అధికారులకు సీఎస్ ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడి ప్రాంతంలో 180 ఎకరాల భూమి త్రిబుల్ ఆర్‌లో అటవి ప్రాంతం కోల్పోతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మరోచోట అటవీ ప్రాంతం కేటాయింపు జరగాలని ఆదేశించారు. ఈ విషయంలో మహబూబాబాద్ జిల్లాలో మరో భూమిని అటవి శాఖకు కేటాయించడానికి సంబంధిత కార్యాచరణ వేగవంతం చేసినట్లు తెలుస్తుంది. సంబంధిత మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించినట్లు తెలుస్తుంది. కొద్ది రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తికానునట్లు రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. త్రిబుల్ ఆర్ కోసం భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఈ విషయంలో రైతులతో సంప్రదింపులు జరపాలని ఇటీవల జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. త్రిబుల్ ఆర్ రోడ్డులో ఉత్తర భూభాగం భూసేకరణలో గజ్వేల్ నియోజకవర్గంలో 980 ఎకరాల భూమిని స్థానికులు కోల్పోతున్నారు. ఇందులో అటవీ భూమి కూడా కొంతవరకు ఉంది. మొత్తం 4,750 ఎకరాల సేకరణ లక్ష్యంగాను ఇప్పటివరకు 3,675 ఎకరాలను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చివరి దశకు తెచ్చారు. ఒక్క అటవీ శాఖకి మాత్రమే భూమికి భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. గజ్వేల్ పరిధిలో 32 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరుగుతుంది. గ్రామాల్లో ఈ రోడ్డుకు సంబంధించిన భూములను గుర్తించారు. తూప్రాన్ పరిధిలో 14 కిలోమీటర్ల రోడ్డు కోసం పలు గ్రామాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. నర్సాపూర్‌లో 28 కిలోమీటర్ల రోడ్డు త్రిబుల్ ఆర్‌లో నిర్మాణం చేపడుతారు. ఇందుకు సంబంధించిన గ్రామాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు.



అంతేకాకుండా అందోల్, జోగిపేట, సంగారెడ్డి పరిధిలో సైతం భూసేకరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్కడి రైతులు ఆందోళన కూడా అదే స్థాయిలో చేస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో త్రిబుల్ ఆర్‌కు సింహభాగం భూమి ఇస్తున్న గజ్వేల్ నియోజకవర్గం 980 ఎకరాల భూమి కోల్పోతుంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు పరిహారం ఎంతవరకు ఇవ్వాలనేది ఇంకా క్లారిటీకి రాలేదు. ఓ పక్క రైతుల ఆందోళనలు, మరోపక్క జిల్లా కలెక్టర్లు రెవెన్యూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. రూరల్, పట్టణాలకు వేరువేరుగా భూమి ధరలు నిర్ణయిస్తామని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో రైతులు మరింత ఆందోళనకు దిగే అవకాశం కనిపిస్తుంది.

భూములను కాపాడేందుకు ప్రాణాలైనా ఇస్తాం

- పేదల భూములు గుంజుకుంటే ఆందోళన ఉధృతం
- ప్రజావాణిలో పలువురు రైతుల వినతి



నవతెలంగాణ-న్యాల్‌కల్

భూములను కాపాడుకునేందుకు ప్రాణాలైనా ఇస్తామని, పేదల భూములు గుంజుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని పలువురు రైతులు ప్రజావాణిలో అధికారులకు స్పష్టం చేశారు. వ్యవసాయంపై ఆధారపడిన తమకు పంట భూమినే జీవనాధారం అంటూ ...కంపెనీలకు ఇచ్చే ప్రసక్తి లేదని పలువురు రైతులు అధికారులకు విన్నవించారు. తాతలు ముత్తాతల కాలం నుంచి వచ్చిన, కొనుగోలు చేసిన పట్టా భూమి పేదల కోసం ఇచ్చిన అసైన్డ్ భూములే తమ ప్రధాన జీవనాధారమని, అలాంటి వ్యవసాయ భూములను ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం లాక్కోవడం ఎంతవరకు సమంజసమని డప్పురు, వడ్డీ, మల్గి తదితర గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం న్యాల్‌కల్ మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో ఫార్మసిటి కంపెనీ ఏర్పాటుకు భూములు తీసుకోవద్దంటూ మూడు గ్రామాల రైతులు నిరసన తెలుపుతూ తహశీల్దార్ కార్యాలయంలో ఇన్చార్జ్ ఎంపీడీవో సురేష్‌కు ప్రజావాణిలో పెద్ద సంఖ్యలో పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం, అధికారులు బలవంతగా భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదని, తమ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో డప్పూర్ రవికుమార్, మారుతి యాదవ్, ఓంకార్, రవి గౌడ్, శివరాజ్, నరేందర్ రెడ్డి, ఖదీర్, పాండు, కార్తీక్, వీరన్న, పలు గ్రామాల రైతులు ఉన్నారు.

ఘనంగా రక్షాబంధన్



నవతెలంగాణ-జిన్నారం

మండలంలో రక్షాబంధన్ పండుగను అన్నా చెల్లెలు ఘనంగా నిర్వహించారు. అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రత్యేకగా నిలిచిన రాఖీ పండగ రోజున తోబుట్టువుల ఆప్యాయత వెల్లి విరిసేలా రాఖీ పండుగ కార్యక్రమాలు ప్రతి ఇంట శోభాయమానంగా జరిగాయి. మండల కేంద్రమైన జిన్నారంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రాఖీ పండుగ ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాఖీ పండుగ సందర్భంగా వెలిసిన ప్రత్యేక రాఖీల దుకాణ సముదాయాలు ఆడపడుచులు రాఖీల కొనుగోళ్లతో సందడి సందడిగా కనిపించాయి.



పేదోళ్ల గుండె చప్పుడు నీలం మదన్న

- నీలం మధుకు రాఖీ కట్టిన ప్రముఖ గాయని మధుప్రియ





నవతెలంగాణ-పటాన్ చెరు

సబ్బండ వర్గాల ప్రతినిధిగా పేదోళ్ల బంధువుగా రాజకీయాలలో ఉన్నత స్థానానికి నీలం మధు అన్న చేరుకోవాలని ప్రముఖ గాయని మధుప్రియ ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలోని చిట్కుల్‌లోని నీలం మధు నివాసంలో సోమవారం ప్రముఖ గాయని మధుప్రియ నీలం మధుకు రాఖీ కట్టి శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధుప్రియ తనపై రేలరే ప్రసాద్ రచనలో పాడిన బహుజనులకు బలం-పేదోళ్ల బంధువే నీలం మదన్న పాట సీడీని, వీడియోను మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుప్రియ మాట్లాడుతూ సబ్బండ వర్గాల ప్రతినిధిగా పేదోళ్ల బంధువుగా రాజకీయాలలో ఉన్నత స్థానానికి నీలం మధు అన్న చేరుకోవాలని కోరుకుంటున్నట్టు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తనపై ప్రేమతో మధుప్రియ పాడిన పాటకు కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



కూకట్‌పల్లి న్యాయవాది సంతోష్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని సోమవారం న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం కోర్టు ముందు పోలీస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దర్శన్, సతీష్, నర్సింహులు, కెప్టెన్ ప్రభాకర్, యాదయ్య, రాజశేఖర్ రెడ్డి, విజయ్, మల్లేష్, రత్నాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్షల రూపాయలు దుర్వినియోగం

- తాజా మాజీ సర్పంచ్ బంధువుల పేర్లపై ఎంబీ రికార్డులు
- పంచాయతీ నిధులు దుర్వినియోగంపై గ్రామ ప్రజలు



నవతెలంగాణ-గుమ్మడిదల

పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని సోమవారం మండలంలోని అనంతారం గ్రామ ప్రజలు, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డిలు ఆరోపించారు. సోమవారం మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి తో పాటు అనంతారం గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. తాజా మాజీ సర్పంచ్ బంధువుల పేర్లపై ఎంబి రికార్డులు చేసి లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారన్నారు. గ్రామంలో అభివృద్ధి పేరుతో గత మాజీ పాలకుల బంధువుల పేర్లపై ఎంబి రికార్డులు చేసి సుమారు 30 లక్షల వరకు పంచాయతీ నిధులను దుర్వినియోగపరచారని, అలాగే సిజిఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా బోరుబావులు వేస్తున్నామని ప్రజలను మభ్యపెట్టి సర్పంచ్‌గా గెలిచిన అనంతరం నాలుగు బోర్ల డబ్బులు పంచాయతీ నిధుల నుంచి తీసుకున్నారని ఆరోపించారు దేవాలయ నిర్మాణాలు దాతల సహకారంతో నిర్మించినప్పటికీ కేవలం సిజిఆర్ ట్రస్టు ద్వారానే దేవాలయాలను నిర్మించామని చెప్పుకోవడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామ ప్రజలకు వాస్తవాలు తెలియకుండా పంచాయతీ అధికారులు సర్పంచ్ కుమ్మక్కై పంచాయతీ నిధులను దుర్వినియోగపరచారని ఆరోపణ చేశారన్నారు. గత సర్పంచి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టారని విమర్శించారు. దళిత కుటుంబాలకు పోచమ్మ దేవాలయం నిర్మాణం చేసి ఇస్తామని ప్రజా ప్రతినిధులు వచ్చి కొబ్బరికాయలు కొట్టినప్పటికీ ఇప్పటివరకు దేవాలయ నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు గతంలో ఎమ్మెల్యే జీఎంఆర్ వికలాంగులకు హెూండా వాహనాలను ఇచ్చినప్పుడు ఉన్న గ్రామంలో ఉన్న వికలాంగుని పేరును కావలసి రాజకీయం చేసి తనకు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న ప్రజలను డబ్బులకు మద్యానికి ప్రలోభ పెట్టి యువకులను చెడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారుల పాలనలో సమాచార చట్టం 2005 ప్రకారం పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పత్రాలు ఆధారంగా చూపిస్తూ వెంటనే పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోపణలలో నిజం లేదు



కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తాము ఎలాంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని తెలిపారు. ఈ మేరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు మాట్లాడుతూ తాము గ్రామ సర్పంచిగా ఎన్నికైనప్పటి నుంచి గ్రామ రూపురేఖలనే మార్చేసామన్నారు. తాము చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేక రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ నాయకులు ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తిప్పి కొట్టారు గ్రామంలో సిజిఆర్ ట్రస్టు ద్వారా నాలుగు బోర్లు రెండు అమ్మవారి దేవాలయాలతోపాటు గ్రామం అంతట సీసీ రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేసినప్పటికీ కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక తమ ఉనికిని కాపాడుకోవడానికి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తిప్పి కొట్టారు. దమ్ముంటే గ్రామ ప్రజల సమక్షంలో కూర్చుందామని, తమ పాలనలో గ్రామం ఎంత అభివృద్ధి చెందిందో తాము చూపిస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ సర్పంచ్‌గా పనిచేసిన వారు గ్రామానికి ఒరగబెట్టిందేమిటో ప్రజల సమక్షంలో తెలియజేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నిధులు అవినీతికి పాల్పడిన వ్యక్తి తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడే చెక్ పవర్ రద్దుతో పాటు సస్పెండ్ అయినవారు మచ్చలేని చిమ్ముల కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేయడం సబబు కాదని హితువు పలికారు. గ్రామ ప్రజా కోర్టులో ఒకవేళ చిమ్ముల కుటుంబ సభ్యులు ఏమైనా అవినీతికి పాల్పడినట్లు నిరూపించినట్లయితే ప్రజలు వేసే శిక్షకు తాము సిద్ధమని తెలిపారు. రాజకీయంగా తమను ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అది మానుకోకపోతే వారు చేసిన తప్పులను గ్రామ ప్రజల సమక్షంలో వెలికి తీసి ప్రజాకోర్టులో శిక్షించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, ఇప్పరాంరెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టయ్య సత్తయ్య, కిష్టా రెడ్డి, శేఖర్ రెడ్డి, ఇంద్ర సేన రెడ్డి, ఈశ్వరయ్య, కిష్టయ్య భారీ ఎత్తున యువకులు దళిత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ

నవతెలంగాణ-జోగిపేట



రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో 17వ వార్డులో సోమవారం కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో వార్డు ప్రజలకు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారికి స్వీట్ గిఫ్ట్ ప్యాక్‌లను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా వార్డు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇంటింటికి గిఫ్టులను అందించారు.

జహీరాబాద్‌లో న్యాయ సంహిత కేసు నమోదు

నవతెలంగాణ-జహీరాబాద్



బస్సు డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన ఆటో డ్రైవర్‌పై న్యాయ సంహిత కేసు నమోదు చేసినట్లు జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. సోమవారం సర్వీసు విధి నిర్వహణలో ఉన్న జహీరాబాద్ డిపో డ్రైవర్ సుభాష్‌పై భౌతిక దాడికి పాల్పడి విధులను ఆటంకపరచిన ఆటో డ్రైవర్‌పై న్యాయ సంహిత సెక్షన్ లు అనుసరించి పోలీస్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించే వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించాలి



- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని వెలుగు కార్యాలయం వద్ద మాజీ సైనికుల సంక్షేమ సంఘానికి 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ సభ్యులు తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. గతంలో 250 గజాల స్థలాన్ని కేటాయించారని ఆ స్థలాన్ని 500 గజాలకు పెంచాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు వటపత్ర సాయి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



- నాటి ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-జహీరాబాద్

రంజోల్ గ్రామ పరిధిలోని ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తమ గురువులకు సన్మానించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రంజోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత కుటుంబ సమేతంగా మళ్ళీ కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నవ్వుల, ఆనందాల కోలాహలంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునందన్ రావు, శ్రీదేవి టీచర్, నహీమొద్దీన్, ఇమ్రాన్, 2004-05 పూర్వ విద్యార్థులు రాములు, భీమ్ రావు, మచ్చందర్, సంగీత, రంజిత, అనిత ప్రస్తుత రంజోల్ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీశైలం, ప్రధాన ఉపాధ్యాయుడు నాతుసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో స్వీట్ గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ

నవతెలంగాణ-జోగిపేట



రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో 12వ వార్డులో సోమవారం కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు ఆధ్వర్యంలో వార్డు ప్రజలకు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఇంటింటికి వెళ్లి రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారికి స్వీట్ గిఫ్టు ప్యాక్‌లను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా వార్డు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇంటింటికి గిఫ్టులను అందించారు.


జోగిపేటలో మాజీ ఎంపీ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట

మాజీ ఎంపీ పట్లోళ్ల మాణిక్ రెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా సోమవారం జోగిపేట పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ ఎంపీ అందోల్ నియోజకవర్గం చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అర్జునయ్య మాజీ మార్కెట్ చైర్మన్ డి.బి. నాగభూషణం, డాకుర్ మాజీ సర్పంచ్ శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్, ఖాజా పాషా, లింగం, కిష్టయ్య జుబెర్, అంజయ్య బీజేపీ నాయకుడు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో నిత్యాభిషేక ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

శ్రావణమాసం సోమవారం ప్రత్యేక రోజు పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. సోమవారం ప్రత్యేక రోజు కావడంతో మండల పరిధిలోని టేకూరు మల్లికార్జున ఆలయం, రేజింతల్ శివాలయంలో నిత్యాభిషేక పూజలు గ్రామ భక్తులు తెల్లవారుజామున ఆలయ పూజారి సిద్ధు స్వామి వేదమంత్రాలతో భక్తిశ్రద్ధలతో శివలింగానికి పూలు పండ్లు సమర్పించి శివనామస్మరణతో అభిషేకంతో హరతి సమర్పిస్తూ భక్తి పాటలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ప్రజావాణిలో 23 దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణి కార్యక్రమంతో ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 23 మంది దరఖాస్తు చేసుకున్నారని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 23 అర్జీలు రాగా రెవిన్యూ 12, సర్వే ల్యాండ్ రికార్డ్ 01, పంచాయతీరాజ్ 03, మునిసిపల్ శాఖ 05 , వ్యవసాయశాఖ 02 వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కరించడంలో అలసత్వం వహించ వద్దని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని జిల్లా అధికారులకు షోకాస్ నోట్ జారీ చేయాలని ఏవో పరమేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి ఆర్‌డిఓ వసంత కుమారి, జిల్లా అధికారులు సాయిబాబా, జగదీష్, నరసింహ, అఖిలేష్ రెడ్డి, జడ్పీ సీఈఓ జానకిరామ్, డిఎం హెచ్ ఓ గాయత్రీదేవి, సంబంధిత జిల్లా అధికారులు, ఏవో పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

మధుర స్మృతుల ప్రతిబింబం ఫోటో

- నీలం మధు ముదిరాజ్
- చిట్కుల్‌లో ఘనంగా ప్రపంచ ఫోటో గ్రాఫీ దినోత్సవం
- లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు



నవతెలంగాణ-పటాన్ చెరు

ఒక్క ఫోటో ఎన్నో జ్ఞాపకాలను పంచుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇస్నాపూర్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఫోటోలు మనం సంతోషంగా ఉన్నప్పుడు మధుర జ్ఞాపకాల్ని పంచుకోవడమే కాదు.. మనతో లేనివారి జ్ఞాపకాలు కూడా పంచుతుందన్నారు. ప్రతి సందర్భంలో మనం తీసుకున్న ఫోటోల ఆల్బమ్ తడిమి చూస్తే ఎంతో సంతోషాన్ని పంచుతుందన్నారు. స్మైల్ ప్లీజ్ అంటూ ప్రతి ఒక్కరిని నవ్విస్తూ ప్రతి శుభకార్యాన్ని తమదే అనుకుంటూ తమ భుజస్కంధాలపై వేసుకుంటూ ప్రతి బంధం మా అనుబంధం అనుకుంటూ ఆ అనుబంధం తాలూకు అద్భుతాలను బంధిస్తూ ఫోటో గ్రాఫర్లు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలను నింపుతారని కొనియాడారు. దానికి తోడు సమాజానికి సంబంధించిన సమస్యలని ఫోటోలలో బంధించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఘనత ఫోటో గ్రాఫర్ల సొంతమన్నారు. అలాంటి ఫోటో గ్రాఫర్ల సంక్షేమానికి తన వంతుగా సహకారం అందిస్తున్నానని తెలిపారు. ఇస్నాపూర్ ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి గతంలో స్థలాన్ని కేటాయించడమే కాకుండా ఫోటో గ్రాఫర్లందరికి హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేసినట్లు వివరించారు. భవిష్యత్తులో సైతం ఫోటోగ్రాఫర్లకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నరేందర్, ప్రధాన కార్యదర్శి సందీప్, లక్ష్మారెడ్డి, రావి, వీరన్న, శంకర్, నారాయణరెడ్డి, వెంకటేశ్, మురళీ, శ్రీను, అనిల్, నిరంజన్, పాల్గొన్నారు.

ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు


నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక మార్కండేశ్వర ఆలయ ప్రాంగణంలో పట్టణ పద్మశాలి అధ్యక్షులు గడ్డం జనార్దన్ ఆధ్వర్యంలో పద్మశాలీల పులి గుర్తు జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మార్కండేశ్వరదేవాలయంలో వేణుభట్ ఆధ్వర్యంలో జోగు అనిత యాదగిరి దంపతులచే రుద్రాభిషేకం, యజ్ఞ కార్యక్రమం ఆర్య సమాజం అధ్యక్షుడు ఈశ్వర్‌జీ మాస్టారు, బండారి సుదర్శన ఆధ్వర్యంలో గాయత్రీ దేవియజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలి విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2024 పదవ తరగతిలో మార్కులు సాధించిన బోడవెన్నెల, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరములో మెరిట్ మార్కులు సాధించిన పలమారి లక్ష్మిలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని ఉత్సాహ కార్యక్రమము అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జహీరాబాద్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణ పద్మశాలిలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు మన పద్మశాలీలకు అతి పెద్ద పండగ అయిన రాఖీ పౌర్ణమి పండుగను కుల బంధువులందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం చాలా ఆనం దంగా ఉన్నదన్నారు. రాబోయే అన్ని పండగ లను కూడా ఘనంగా నిర్వహించుకోవాలని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. పండగ సందర్భంగా పద్మశాలి కుల బంధువులలో విద్యను ప్రోత్సహించుట గురించి పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహకరంగా బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఆనవాయితీని రాబోయే రోజులలో కూడా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పి.రాములు నేత, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కర్దాస్ మనోహర్, కోశాధికారి గడ్డం నాందేవ్, ముఖ్య సలహాదారు దోమల పండరి, న్యాయవాదులు కర్దాస్ పవన్, మా శెట్టి జగదీష్, కార్యవర్గ సభ్యులు సుదర్శన్ బండారి, మారెల్లి వెంకటయ్య,కొప్పెరి లక్ష్మణ్ ,చిప్ప సత్యనారాయణ, సగ్గంవిట్టల్ , అప్పం శ్రీనివాస్, గుండ్ల మల్లయ్య గూడ జగన్, సగ్గం శ్రీనివాస్, గడ్డం పాండు, మేనేజర్ నీలి రాజేష్, దైవంశెట్టి పాల్గొన్నారు.

కేతకిలో జహీరాబాద్ ఎంపీ పూజలు

నవతెలంగాణ-ఝరాసంగం



దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ సోమవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీధర్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు శంకర్ పాటిల్, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ల్యాఖత్, ఆన్సర్, తదితరులు ఉన్నారు.

రక్షబంధన్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలకు అక్క చెల్లెళ్లకు అన్నదమ్ములకు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కచెల్లెళ్లకు రక్షణగా అన్నదమ్ములు ఉండాలని తెలిపారు. మహిళ సాధికారత, సహకారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు.

జోగిపేటలో శివధనస్సు ఊరేగింపు



నవతెలంగాణ-జోగిపేట : రాఖీ పండుగను పురస్కరించుకొని సోమవారం జోగిపేట చేనేత సంఘం ఆధ్వర్యంలో శివధనుస్సు ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘం కార్యాలయ ఆవరణలో మార్కండేయ దేవాలయంలో శివధనస్సుకు రాఖీలు కట్టి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంఘం నుంచి ప్రధాన వీధుల గుండా శివధనస్సును పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వర్కల అశోక్, మాజీ అధ్యక్షులు సత్యం, సభ్యులు వెంకటేశం, నందు, లక్ష్మీనారాయణ, నారాయణ, రాజేందర్, సుధీర్, వీరేశం, సత్యం, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి







నవతెలంగాణ-మనూర్

నాగల్‌గిద్దా మనూర్ మండలాల పరిధి గ్రామాలలో సోమవారం రాఖి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోదర, సోదరీమణులు అనుబంధానికి ప్రతీకగా రాఖి కట్టి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నవతెలంగాణ-చౌటకూర్

చౌటకూర్ మండల కేంద్రంలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విఠలేశ్వర దేవాలయం నుంచి కాశి విశ్వేశ్వర ఆలయం వరకు శివధనస్సులను ఊరేగింపు చేశారు. అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలను చేసుకుంటారు. రక్షాబంధన్ పండగ. పాటలు పాడుతూ ఈ శివధనస్సు ఊరేగింపులో పాల్గొన్నారు. పద్మశాలి సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రక్షాబంధన్ వేడుకలను సోదర భావంతో నిర్వహించుకున్నారు. ఆత్మీయత, అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను సోదర సోదరీమణులు కనుల పండువగా నిర్వహించారు. అక్కా, చెల్లెల్లు దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకొని సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేసి, తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఒకరికొకరు రక్షగా ఉంటామంటూ మాట ఇచ్చి పుచ్చుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ, మిఠాయి దుకాణాలు కళకళలాడాయి. మండలాల్లోని అన్నిగ్రామాల్లో తమ తోబుట్టువులు గ్రామాల నుంచి రావడంతో ప్రతి ఇంట పండుగా వాతావరణం నెలకొంది.

నవతెలంగాణ-మునిపల్లి

మండల వ్యాప్తంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం అన్నా చెల్లెలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అన్న చెల్లెలు... తమ సోదరులకు ప్రేమానురాగాలతో రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి నిర్వచనంగా రాఖీ పండుగ ఆనంద ఉత్సవాల మధ్య నిర్వహించుకున్నారు. "రాఖీ పౌర్ణమి సందర్భంగా" మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకి, మాజీ అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌కి, మునిపల్లి మాజీ జెడ్పిటిసి పైతర మీనాక్షి సాయికుమార్ రాఖీకట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట సంగారెడ్డి మాజీ జెడ్పిటిసి సునీత మనోహర్ గౌడ్, నాల్కల్ మాజీ జెడ్పిటిసి స్వప్న భాస్కర్, కంది మాజీ ఎంపీపీ సరళ తదితరులు ఉన్నారు.

నిజాయితిని చాటుకున్న పోలీస్ ఫోటో గ్రాఫర్ చిరంజీవి

నవతెలంగాణ-సంగారెడ్డి



పోలీస్ ఫోటోగ్రాఫర్‌గా చిరంజీవి ఉదయం ఉద్యోగ రిత్యా ఆఫీస్‌కు వెళుతుండగా సంగారెడ్డి రెడ్లాస్ ముందు సుమారు రూ.30 వేల విలువ చేసే సామ్‌సంగ్ ఫోన్ రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించాడు. ఆ ఫోన్ తీసుకుని ఆఫీస్‌కు వచ్చి స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ యాదవరెడ్డికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. వివరాలు సేకరించగా, సదాశివపేట శాస్త్రినగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ ఫోన్ పోగొట్టుకున్నట్లు గుర్తించారు. అతన్ని జిల్లా పోలీస్ కార్యాలయానికి పిలిచి ఫోన్ అప్పగించారు. ఎంతో డబ్బులు పెట్టి కొన్న సెల్ ఫోన్ పోవడంతో బాధలో ఉన్న నాకు.. "నీ ఫోన్ దొరికింది" అని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సమాచారం రాగానే చాల సంతోషంగా అనిపించిందని, బాధితుడు సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖకు, చిరంజీవికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజేష్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్



శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజేష్ పుట్టినరోజు వేడుకలకు రైతు బిడ్డ పల్లవి ప్రశాంత్ పాల్గొని మర్యాదపూర్వకంగా రాజేష్‌ను సన్మానించి, కేక్ కట్ చేశారు. రాజేష్ ఉన్నత పదవులు ఎన్నో పొందాలని ఇంకా ఉన్నత స్థాయిలో ఉండాలని రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్ ఆకాంక్షించారు. స్ట్రీట్ చిల్డ్రన్ ఫౌండేషన్ పేరుతో తన వంతు సహకారాన్ని అందిస్తూ నిరుపేదల సంక్షేమానికి రాజేష్ కృషి చేస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాక్టర్ మినీ మాక్స్, డీజే కార్తిక్, డాన్సర్ చింటూ బోరించ ఉప సర్పంచ్ సునీల్, మనూర్ ఎంపిటిసి రవీందర్ మన్నూరు, మండల్ యూత్ కాంగ్రెస్ ఆనంద్, రిపోర్టర్ దుమ్మ రాజు, ఫేమస్ ఫ్యాషన్ హబ్ సిమోన్, శీను, ధనలక్ష్మి జువెలర్స్ శేఖర్ చారి, వర్ధన్ చారి, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ జిల్లా శారీరక్ ప్రముఖ మనోజ్ కుమార్



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని మెదక్ జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ శారీరక ప్రముఖ మనోజ్ కుమార్ అన్నారు. సోమవారం పెద్ద శంకరంపేటలోని సరస్వతి శిశు మందిర్లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రక్షాబంధన్ విశిష్టత గురించి వివరించారు. సామాజిక సమరస్యత, కుటుంబ ప్రబోధన్, పర్యావరణం, స్వదేశీ పౌరుల హక్కులు, తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, పాఠశాల అధ్యక్షులు జాదగారి గంగాధర్, ప్రధాన ఆచార్యులు వీరప్ప, ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు జైహింద్ రెడ్డి, సీతారామారావు, రవి వర్మ సతీష్ గౌడ్, మధు శైలేష్ శ్రీకాంత్, అధిక సంఖ్యలో స్వయంసేవకులు పాల్గొన్నారు.

నేను నీకు రక్షా నువ్వు నాకు రక్ష



నవతెలంగాణ-తూప్రాన్

నేను నీకు రక్ష నువ్వు నాకు రక్ష అంటూ రాఖీ పౌర్ణమి వేడుకలు అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి తూప్రాన్ మండల వ్యాప్తంగా సోమవారం రోజున రాఖీ పౌర్ణమి పండగ నిర్వహించుకున్నారు. మండలంలోని పెద్దలు, అధికారులు, అనధికారులు, ప్రజలు, అన్నా చెల్లెలు, చిన్నారులు కుల మత భేదాలు లేకుండా ఒకరికొకరు రాఖీలు కట్టుకొని, శుభాకాంక్షలు తెలిజేసుకుంటూ ఘనంగా పండుగను నిర్వహించుకున్నారు.

బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో సామూహిక ఉపా కర్మ



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్‌లో బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆధ్వర్యంలో సామూహిక శ్రావణి ఉపాకర్మ జరిగింది. బ్రాహ్మణులకు ఎంతో విశిష్టదినమైన శ్రావణ పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా వ్యవహారిస్తుంటారు. సోమవారం నూతన యజ్ఞ ఉపవీత ధారణ గావించడం విశేషం. సోమవారం స్థానిక పరమేశ్వర్ అయ్యర్ స్వగృహంలో ఈ కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాయత్రి మాతను ఆహ్వానం చేసి, మహా సంకల్పమును నిర్వహించి నూతన గాయత్రి ధారణ, తర్పణ కార్యక్రమం నిర్వహించి గాయత్రీ దేవికి మంగళ హారతులు చేసి, ఎల్లవేళలా గాయత్రీ దేవి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి దేవాలయంలో చండీ హెూమం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని వీరన్న గూడెం వీరభద్ర స్వామి దేవాలయంలో శ్రావణ సోమవారం పౌర్ణమి సందర్భంగా చండీ హెూమం, పూర్ణాహుతి, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని రోజువారిగా దేవాలయంలో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వీరభద్ర స్వామి దేవాలయాన్ని ప్రతిరోజు శ్రావణ మాస విశిష్ట రోజుగా భావించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవాలయ కార్యనిర్వాహక అధికారి ఉప్పల శశిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది భారీ సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర 2025 కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జహీరాబాద్

హజ్ యాత్ర 2025 కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జహీరాబాద్ హజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గౌసుద్దీన్ తెలిపారు. దరఖాస్తుల సమర్పణ తేదీని కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీలు ప్రకటించాయని ఆయన తెలిపారు. హజ్ యాత్రికులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 9వ తేదిలో సమర్పించాలన్నారు. హజ్ యాత్రికుల పాస్‌పోర్ట్ జనవరి 2026 వరకు చెల్లుబాటులో ఉండాలన్నారు. పట్టణంలోని మెహందీ కాంప్లెక్స్‌లో ఉన్న జహీరాబాద్ హజ్ సొసైటీ ఉచిత సేవ, యాత్రకు సంబంధించిన అన్ని విషయాలు సూచించబడతాయని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 9398394451, 9440477438లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సామాజిక కార్యకర్త విశ్వనాథ్ కోట మృతి

- మంగళవారం అంత్రక్రియలు



నవతెలంగాణ-జహీరాబాద్

లింగాయత్ సమాజ్ ప్రముఖులు, ఆత్మ బంధు పరివార్ వ్యవస్థాపకులు, విశ్వనాథ్ కోట (86) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన అల్లుడు సిద్ధన్న పాటిల్ తెలిపారు. అంత్రక్రియలు మంగళవారం ఉదయం 10 గంటలకు జహీరాబాద్‌లోని లింగాయత్ సమాజ్ స్మశాన వాటిక రుద్రభూమి నందు నిర్వహిస్తారని తెలిపారు.

అతివేగంతో కరెంటు పోల్‌ను ఢీ కొట్టిన కారు

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలో కారు అతివేగంతో కరెంటు పోల్‌ను ఢీ కొట్టిన సంఘటన సోమవారం రోజున జరిగింది. కారును అతివేగంతో నడిపి అదుపు చేయలేకనే కరెంటు పోల్ను ఢీ కొట్టినట్లుగా సమాచారం. కారు నడిపిన వారు పరారీలో ఉన్నట్లు, కారు నడిపిన వ్యక్తి ఓ మహిళగా అనుమానిస్తూ, కారు ఢీ కొట్టిన సంఘటన దగ్గర చుట్టుపక్కల ప్రజలు ఈ కారు ఎవరిదో అని అనుమానిస్తున్నారు. అయితే ఈ కారు నడిపిన మహిళ, కారుకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉన్నది.



విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం విద్యార్థులకు సకాలంలో అందించాలి
- ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు





నవతెలంగాణ-కౌడిపల్లి

కౌడిపల్లి మండలం తునికి బీసీ పాఠశాల గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్ బీసీ పాఠశాల, కళాశాల ఉన్న ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కౌడిపల్లి మండలం తునికి బీసీ గురుకుల పాఠశాలను కళాశాలను రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, భోజన శాల, డార్మెంటరీలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి సమగ్ర అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వం నిర్దేశించిన మెన్యూ ప్రకారం పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థికి అందించాలని, విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని సకాలంలో అందజేయాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పై రెగ్యులర్‌గా చెక్ అప్ చేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని తరగతి గదిలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను అదనపు కలెక్టర్ పరీక్షించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరిబాబు, తదితర అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

రైతుల విజ్ఞప్తులు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో 63 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదీదారులతో మమేకమై వారి సమస్యలను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 63 విజ్ఞప్తులను స్వీకరించారు. అందులో రుణమాఫీ-22 , ధరణి -19, పింఛన్- 4 , ఇతర సమస్యలు-22, మొత్తం -63 దరఖాస్తు స్వీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీకగా చేసుకునే పండుగ రక్షాబంధన్

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

సోదర భావానికి ప్రతీకగా ప్రతి ఏటా చేసుకునే పండుగ రక్షాబంధన్ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం రాఖీ పండుగ పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ బాలసదనం బాలికలు సుమారు 16 మంది జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్ రాజ్ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ రాఖీ పండగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు కలెక్టర్ తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించడం, ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు. అక్కా, చెల్లెళ్ళ రక్ష తమ గురుతర బాధ్యత అని, రక్షాబంధన్ కర్తవ్యాన్ని గుర్తు చేస్తుందన్నారు. సోదరభావంతో, ప్రేమానురాగాలతో ప్రతి ఏటా శ్రావణ మాసం పౌర్ణమి రోజు రాఖీలు కట్టుకుంటూ చేసుకునే ఈ వేడుక భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల ఔన్నత్యాన్ని యావత్ ప్రపంచానికి చాటుతుందన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ, డీసీపీఓ కరుణ, గంగాధర్, చైల్డ్ హెల్ప్ లైన్, భరత్ రవీందర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని వల్లూరు గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన మహమ్మద్ ఇసాఖ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కును సోమవారం బీఆర్ఎస్ నేతలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని, సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. చెక్కును మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యేకు లబ్దిదారుడు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు అబ్దుల్ వహీద్, మాజీ సర్పంచ్‌లు ఎల్లబోయిన జన, అంబరీష్, బీఆర్ఎస్ నాయకులు సురేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



పట్టా పాస్ బుక్ ఉన్న అందరికీ రుణమాఫీ చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగులను పక్కకు పెట్టడం భావ్యం కాదు
- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హీరాలాల్




నవతెలంగాణ-పాపన్నపేట

పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హీరాలాల్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టా పాస్ బుక్ ఉన్న రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, రుణాలు తీసుకొని వారు వెంటనే బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకోవాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడేమో ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి కాలంలో ఉద్యోగం చేసుకుంటే పొట్ట బట్టతోపాటు పిల్లల చదువులకే జీతాలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చాలామంది ఉపాధ్యాయులు గృహ నిర్మాణాల కోసం తీసుకున్న లోన్లు కట్టలేక సతమతమవుతున్నారని వెల్లడించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు మర్చి పోవద్దన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద భూస్వాములు ఏమి కారని, ఏ ఉద్యోగి కూడా రెండు మూడు ఎకరాల కన్నా ఎక్కువ లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు రుణమాఫీ చేయకుంటే ప్రభుత్వంపై వ్యతిరేక భావం ఏర్పడే అవకాశం ఉందని, వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీ సందేహాలను, విజ్ఞప్తులను మండల వ్యవసాయ అధికారులు స్వీకరించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

రైతుల యొక్క రుణమాఫీ సందేహాలను విజ్ఞప్తులను మండల వ్యవసాయ అధికారులు స్వీకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సోమవారం తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు రైతులకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫీస్ నందు అందుబాటులో ఉండి రైతుల యొక్క రుణమాఫీ సందేహాలను, విజ్ఞప్తులను స్వీకరించాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు ఆదేశించారు. రుణమాఫీకి సంబంధించిన ఆధార్ మిస్ మ్యాచ్, ఫ్యామిలీ గ్రూప్ ఇన్ అగ్రికల్చర్ పాసుబుక్ సంబంధించి కరెక్షన్ చేయాల్సిన విధానం ఇంకా రుణమాఫీ సైట్ నందు రానందున అప్పటివరకు ఆధార్ కార్డు వివరాలు ఫ్యామిలీ మెంబర్స్ ఆధార్ కార్డు వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు సేకరించి ప్రత్యేక రిజిస్టర్ మంగళవారం నుంచి మైంటైన్ చేయాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు.

మున్సిపాలిటీ ఏరియాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్
- కమిషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సోమవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానికిషోర్, కమీషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్‌లు అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్‌లతో, అన్ని మున్సిపాలిటీ కమీషనర్‌లతో, డీటీసీపీ డిపార్ట్మెంట్ ఉన్నతధికారులతో సెక్రెటరియట్ నుంచి వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా లే అవుట్ రెగ్యులజేషన్ స్కీం అమలు, మెప్మా స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, జిల్లా హెడ్ క్వార్టర్, అన్ని మున్సిపాల్ 6 ప్రదేశాలలో మహిళా శక్తి క్యాంటిన్ లు ఏర్పాటు అంశలపై రివ్యూ నిర్వహించారు. అదేవిధంగా ప్రస్తుత స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం, అన్ని మున్సిపాలిటీల్లో వీధి కుక్కల నియంత్రణ అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు కార్యక్రమము, తదితర అంశలపై ప్రిన్సిపల్ సెక్రటరీ దానికిశోర్ సంబంధిత అడిషనల్ కలెక్టర్‌లకు తగు సూచనలు చేసినారు. జిల్లా సమకృత కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, డీటీసీపీ అధికారి వందనం, మున్సిపాలిటీ కమీషనర్ ప్రేరణ పాండే, నర్సయ్య రాజశేఖర్, రమేష్, నాగేందర్, మెప్మా పిడి హన్మంత రెడ్డి, ఇంజనీర్ పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు

ఖర్గేనీ కలిసిన చక్రధర్ గౌడ్



నవతెలంగాణ - సిద్దిపేట

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని మర్యాదపూర్వకంగా కలిశారనీ కాంగ్రెస్ నాయకులు, ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ ఛైర్మెన్ చక్రధర్ గౌడ్ తెలిపారు. సోమవారం చక్రధర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పని చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించాలన్నారు. రైతుల ందరికీ రుణమాఫీ ఖచ్చితంగా జరుగుతు ందని ప్రచారం చేయాలని తెలిపినట్లు తెలిపారు.

21న జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



నవతెలంగాణ-చేర్యాల

ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ కోసం రాష్ట్రాలకు స్వేచ్ఛ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ వివిధ దళిత సంఘాలు ఈ నెల 21న తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మాల మహానాడు కార్యకర్తల సమావేశం సోమవారం చేర్యాల మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. మాల, మాల ఉపకులాల ప్రజలు, ప్రజా సంఘాలు కలిసి తమవంతుగా ఈ బందును జయప్రదం చేయాలని కోరారు. బంద్‌కు వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు గుస్క రామదాస్, పుట్ట యాదయ్య, ఉద్యోగులు కాటం శ్రీనివాస్, పుట్ట మల్లికార్జున్, నియోజకవర్గ ఇంచార్జి శ్రీరామ్ వెంకటేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చంద శ్రీకాంత్, లాయర్లు నీరటి వెంకటేష్, గుస్క వెంకటేష్, కొలుపుల రవి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా లింగారెడ్డిపల్లి సేవాసమితి



నవతెలంగాణ-రాయపోల్

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం కోసం నిస్వార్థంగా సామాజిక ప్రజా సేవ చేయడమే పరమావధిగా సమాజంలో ప్రజా సేవ చేస్తున్న కొంతమంది ప్రజా సేవకులను ఆదర్శంగా తీసుకొని గ్రామములో కష్టాలలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా లింగారెడ్డిపల్లి సేవా సమితి యువత నడుం బిగించింది. సాటి మనిషికి సహాయం చేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. రాయపోల్ మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం రాంసాగర్ మల్లయ్య అకాల మరణం చెందారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో లింగారెడ్డిపల్లి సేవా సమతి సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.12,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా లింగారెడ్డిపల్లి సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు సేవ చేయడం ఎంతో అదృష్టమని ఎన్ని డబ్బులు సంపాదించడం ముఖ్యం కాదని ఎంత మందికి సహాయం చేసామన్నది ముఖ్యమన్నారు. లింగారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న సుమారు 50 మంది వరకు యువత గ్రామంలో ఎవరికి ఇలాంటి ఆపద వచ్చినా మనమే సహకారం అందించాలని లింగారెడ్డిపల్లి సేవా సమితి సంస్థను ఏర్పాటు చేశారని ఈ సంస్థ ద్వారా గ్రామంలో ప్రజా సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి పల్లి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృత్యువాత



నవతెలంగాణ-రాయపోల్

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు అక్కమొల్ల నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన అక్కమొళ్ల నర్సింలు గొర్రెలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతిరోజు మాదిరిగానే ఆదివారం ఉదయం గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం తిరిగి గొర్రెలను తన ఇంటి పాకలో కట్టేశాడు. రాత్రి భోజనం తర్వాత కుటుంబ సభ్యులందరూ నిద్రపోయారు. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గొర్రెలు విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. వెంటనే నర్సింలు వచ్చి చూసేసరికి విద్యుత్ షాక్ ప్రమాదంలో 8 గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. గొర్రెల మృతితో రూ. లక్ష ఆర్థికంగా నష్టపోయానని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు బోరున విలపించాడు. గొర్రెలను నమ్ముకుని గొర్ల కాపరిగా జీవనం సాగించే నాకు ఇలాంటి ప్రమాదం వల్ల జీవాలను నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు.

అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిని నర్సింహులు

నవతెలంగాణ-గజ్వేల్



కోల్‌కత్తాలో వైద్యూరాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోవడం బాధాకరం అని ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు ఆసుపత్రిలో రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న డాక్టర్లే అత్యాచారానికి గురి కావడం బాధాకరమన్నారు. మహిళల పైన ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే నిందితులను గుర్తించి కఠినాతికఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లకు ఘన సన్మానం

నవతెలంగాణ-గజ్వేల్



అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినో త్సవం పురస్కరించుకొని సోమవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యం లో పలువురు ఫోటోగ్రాఫర్లకు ఘనంగా సన్మానం చేశారు. ఇందులో భాగంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ ఆర్కే శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు లయన్ మల్లేశం గౌడ్, లయన్ దొంతుల సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మన ఆకారాన్ని అత్యంత సుందరంగా మలిచే వారే ఫోటోగ్రాఫర్స్ అని అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ ఆర్కె శ్రీనివాస్ తో పాటు పలువురు ఫోటోగ్రాఫర్స్ కు సన్మానం చేసి అభినందనలు తెలియజేశామని అన్నారు.

దశాబ్దిలో వెలుగు వెలిగి..

- ఇప్పుడు గజ్వేల్‌కి (కడా) చీకటి



నవతెలంగాణ -గజ్వేల్

అభివృద్ధిలో అంతంతగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గం 2014 నుంచి 2023 వరకు దశాబ్ద పాటు ఒక వెలుగు వెలిగి ఒకేసారి చీకట్లు కమ్ముకునే పరిస్థితికి గజ్వేల్ అభివృద్ధి చేరుకుంటుంది. 2014లో మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచి తొలిసారిగా పోటీ చేసి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గం రూపురేఖలను మార్చారు. దీంతో రాష్ట్రం లోనే కాకుండా దేశంలో కూడా గజ్వేల్ పేరు మారు మోగింది. 2014 గెలిచిన తర్వాత జరిగిన అభివృద్ధి మాత్రమే ఉంది తప్ప రెండవసారి 2018లో గెలిచినప్పటికీ అక్కడక్కడ ఉన్న కొన్ని పెండింగ్ పనులు పూర్తి చేసినప్పటికీ కొత్త పనులు ఏవి చేయలేకపోయారు. అయినప్పటికీ గజ్వేల్ నియోజకవర్గానికి కొత్త రూపం తెచ్చిన కేసీఆర్ ప్రభుత్వం తిరిగి మూడవసారి రాకపోవడంతో గజ్వేల్ ప్రాంతం అభివృద్ధితోపాటు ప్రభుత్వ కార్యాలయాలు తోకముడుస్తున్నాయి. కేసీఆర్ గెలుపొందడంతో 2014లో ఏర్పాటుచేసిన గడ (గజ్వేల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటి) చేసి అభివృద్ధి చేశారు. ఇప్పుడు సీను మారింది. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ఆయన నియోజకవర్గం కొడంగల్ కు (కడా) గజ్వేల్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోతున్నాయి. గడ నుంచి కడాక వెళ్తున్నాయని ప్రధాన చర్చగా మారింది. దీంతో స్థానిక ప్రజలు అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యమైన కార్యాలయాలు తరలిపోవడంతో గజ్వేల్ ఇక చీకటి కమ్ముకుంటుందని ప్రజలు చర్చించుకోవడం కనిపిస్తుంది. గజ్వేల్ నుంచి ఆర్అండ్ బీ ఈఈ కార్యాలయం తరలింపునకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో భారీ అభివృద్ధి పనులకు తెరతీసిన వేళ.. కడా(కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ)తో ఇక్కడి అధికారులను అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. త్వరలోనే ఇక్కడి ఆర్అండ్ బీ ఈఈ కార్యాలయం ఫర్నిచర్తో సహా తర లిపోనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గజ్వేల్‌లో ఉండే గడక సంబంధించిన కారు కొడంగల్ కు వెళ్ళిపోయింది.

2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్. గజ్వేల్ దేశంలోనే ఆదర్శ నియోజకవర్గం గా తీర్చిద్దడానికి సంకల్పించారు. ఇందుకోసం 'గడ' (గజ్వేల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ)ని ఏర్పాటు చేశారు. సీఎంగా తను నిత్యం నియోజకవర్గ ప్రజలను కలిసే అవకాశం చేనందువల్ల తన ప్రతినిధిగా సేవలందించడానికి 'గడ'కు ప్రత్యేకాధికారిని నియమించారు. కేసీఆర్ ఆశించినట్లుగానే 'గడా గజ్వేల్ అభివృద్ధికి సోపానంగా నిలిచింది. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో 'గడా' కీలక భూమిక వహించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం తో 'గడ యథాతథంగా రద్దయిన సంగతి తెలిసిందే. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలో వేజ్ నాన్ వెజ్ మార్కెట్ అంటే సమీకృత మార్కెట్, సీఎం మినీ క్యాంప్ ఆఫీస్ , రవీంద్ర భారతి స్థాయిలో గజ్వేల్ లో నిర్మించిన





మహతి ఆడిటోరియం, మాతా శిశు ఆసుపత్రి, గజ్వేల్ పట్టణంలో జిల్లా ఆసుపత్రి, బాలుర బాలికలకు వేరువేరుగా ఎడ్యుకేషన్ హబ్బు నిర్మాణం చేపట్టారు. వీటన్నిటితోనే కళ వచ్చింది అని చెప్పాలి. వీటిని పర్యవేక్షించే అధికార కేంద్రాలు తరలిపోతుండడంతో పరిస్థితి ఏమిటి అని ప్రజలు ఆలోచన చేస్తున్నారు.

ప్రభుత్వ శాఖలు ఒకే చోట.

గజ్వేల్లోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవన సముదాయం 45కి పైగా ప్రభుత్వ శాఖలు ఒకే చోట ఉండేలా భవనాన్ని ఏర్పాటు చేశారు. కేసీఆర్ గజ్వేల్లో జిల్లా కేంద్రం తరహాలో ప్రభుత్వ కార్యాయాలను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ శాఖలు ఒకే ప్రాంగణంలో విధులు నిర్వహించుకునేవిధంగా వీలుగా రాష్ట్రంలోనే మోడల్గా ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐఓసీ) నిర్మించారు. ప్రత్యేకించి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్వహణ కోసం ఇక్కడ రాష్ట్రంలోనే కీలకమైన ఇరిగేషన్ ఈ ఎన్‌సీ కార్యాలయాన్నీ, దీనికి అనుబంధంగా గజ్వేల్, సిద్ది పేట, భువనగిరి, మెదక్ సర్కిల్ కార్యాలయాలు, వీటి కింద డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కార్యాలయాలు గజ్వేల్ ఐఓసీలోనే కొనసాగుతుండటం జిల్లా కేంద్రాన్ని తలపించింది.

జిల్లా స్థాయి శాఖల తరలింపు.

ఇదే తరహాలో రోడ్డు భవనాల శాఖ పరిధిని కూడా పెంచిన ఇక్కడ ఈఈ పర్యవే క్షణలోని డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీని పరిధిలో గజ్వేల్, జగదేవ్‌పూర్ తోపాటు పలు సబ్ డివిజన్ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఈఈ కార్యాలయంలో ప్రస్తుతం ఈఈతోపాటు ఒక డీఏఓ, ఒక సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, హెచ్‌ఆర్ ఇన్చార్జి, జూనియర్ అసిస్టెంట్, ఈఈ పీఏ, అటెండర్లతోపాటుగా మరో ఏఈఈ పనిచేస్తున్నారు. ఈ కార్యాలయాన్ని త్వరలోనే కొడంగల్కు తరలించడానికి రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి జీఓ కూడా వెలువడ నుందని సమచారం.ఇక్కడున్న పీర్ ఈఈ కార్యాలయం కూడా తీసుకొని పోయే అవకాశమున్నదని తెలుస్తోంది. ఇకపోతే ప్రస్తుతం గజ్వేల్ కేంద్రంగా ఇరిగేషన్ ఈఎన్సీ కార్యాలయం పరిధిలో సిద్దిపేట, భువనగిరి, మెదక్ సర్కిల్ కార్యాలయాలు ఇక్కడే కొనసాగుతుండగా, ఇవీ కూడా వాటి సొంత జిల్లాలకు తరలిపోను న్నాయని ప్రచారం జరుగుతోంది. ఇదంతా జరిగితే గజ్వేల్ ఇక కళను కోల్పోవడం ఖాయమని ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇంకా ఇక్కడ పనులు పూర్తి కాలేదు.

గజ్వేల్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు పెండింగ్లో ఉన్నాయి. ముఖ్యంగా గజ్వేల్ రింగ్ రోడ్డు 95 శాతం పూర్తయినప్పటికీ మిగతా పనులు అలాగే ఉన్నాయి. రేడియో రోడ్లు పూర్తిస్థాయిలో కాలేకపోయాయి. గ్రామీణ ప్రాంతంలో డబుల్ రోడ్డు మంజూరు చేసినప్పటికీ నిధులు మంజూరు చేసిన పనులు ప్రారంభం కాలేదు. ఉన్నంత స్థాయి అధికారులు గజ్వేల్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు తరలింపు పై పునర్ ఆలోచన చేయాలని ప్రజల విజ్ఞప్తి చేస్తున్నారు.

రుణమాఫీపై రైతులు ఆందోళన చెందొద్దు

- మర్కుక్ మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన రైతు రుణమాఫీ 2024 సంబంధించి మూడు విడతల్లో రైతులకు చెందిన రుణమాఫీ ఖాతాలో నిధులు జమ అయ్యాయని మర్కుక్ మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్ రెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాల దృష్ట్యా బ్యాంకు ఖాతాలు సరిగా లేనివి, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నెంబర్‌లలో తప్పులున్నవి, పాస్ బుక్ నెంబర్లు లేనివి, బ్యాంకు ఖాతాల్లో ఉన్న పేర్లతో ఆధార్‌కార్డులో ఉన్న పేర్లతో సరిపోని ఖాతాలు వంటి కారణాలవల్ల మరి కొంతమంది రైతులకు చెందిన రుణ ఖాతాల్లో నిధులు జమ కాబడలేదన్నారు. ఈ రైతులకు చెందిన విజ్ఞప్తులను ఫిర్యాదులను స్వీకరించడానికి మండల వ్యవసాయ కార్యాలయంలో, మర్కుక్ రైతు వేదికలో మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి విజ్ఞప్తులను, ఫిర్యాదులను తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, రెండు లక్షల పైబడి రుణం కలిగిన రైతులకు రెండు లక్షల పోగా మిగతా రుణం తిరిగి చెల్లించడానికి చాలామంది రైతులు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ రైతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆదేశాలు వెలువడతాయన్నారు. అప్పటివరకు రైతులు వేచి చూడాలని రుణమాఫీకి సంబంధించి ఎలాంటి విజ్ఞప్తులు సమస్యలు, సందేహాలు ఉన్న మండల వ్యవసాయాధికారులు సంప్రదించాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక విజ్ఞప్తుల విభాగాన్ని సందర్శించి తమ ఫిర్యాదులను అందించాలని రైతులను కోరారు.

గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-మర్కుక్



గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమరా 100 మందితో సమానమని మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని గణేశ్ పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ప్రజల రక్షణ సెన్సాఫ్ సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని 24 గంటలు పనిచేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడలిలో, ఎగ్జిట్ ఎంట్రీ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పనిచేయడం లేదని , గ్రామంలో ఉన్న యువకులు ఏం చేస్తున్నారు. అనేది తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. యువకులు గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉంటుందన్నారు. యువకులు ఏదైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా, నాటు సారాయి తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. త్వరలో రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని గ్రామంలో సామరస్య వాతావరణం గురించి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అధికారులము రుణమాఫీ అయిందని కేవైసీ అప్డేట్ చేయాలని కారణాలతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారని, ఎవ్వరు కూడా బ్యాంకు వివరాలు మీ పర్సనల్ డాటాను షేర్ చేయవద్దని సూచించారు. రుణమాఫీ విషయంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆన్లైన్ మోసాల బారిన ఎవరు కూడా పడవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్ నడపవద్దని, ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే, ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ప్రజల ధన మాన ప్రాణ రక్షణకు డిపార్ట్మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు, గ్రామస్థులు తదితరులున్నారు

అన్నాచెల్లెల మధుర బంధమే అనుబంధాలకు రక్షణ బంధనం

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్





రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలసదనం బాలికలు జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరికి రాఖీలు కట్టారు. రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలో బాలసదనం చిన్నారులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ప్రతి ఒక చిన్నారి రాఖీ కట్టగా జిల్లా కలెక్టర్ చాలా సంతోషించి ప్రతి ఒక చిన్నారికి స్వయంగా స్వీట్స్ తినిపించి, అక్షింతలు వేసి ఎల్లప్పుడూ ఆనందంగా, సంతోషంగా ఉండాలని ఆశీర్వదించారు. కలెక్టర్ చిన్నారులతో కాసేపు సంభాషిస్తూ.. ఎలా చదువుకుంటున్నారు అని, రాఖీ పండుగ సందర్భంగా ఏం కావాలని ఆప్యాయంగా పిల్లలను అడగగా ఐస్ క్రీమ్స్ కావాలని కోరారు. వెంటనే జిల్లా కలెక్టర్ పిల్లలందరిని షాప్‌కి తీసుకు వెళ్ళి వారికి నచ్చిన దుస్తులను తీసుకోవాలని, స్వీట్ షాప్, ఐస్ క్రీమ్ పార్లర్లలో వారికి నచ్చిన ఐస్ క్రీమ్స్, స్వీట్స్ కొనివ్వాలని అందుకు అవసరమైన డబ్బులను వ్యక్తిగతంగా ఇస్తానని జిల్లా సంక్షేమ అధికారి శారదకు సూచించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీనివాస్ రెడ్డికి, గ్రీవెన్స్‌లో వివిధ శాఖల అధికారులకు చిన్నారులు రాఖీలు కట్టారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేతకు ఘన నివాళులు

నవ తెలంగాణ - మిరుదొడ్డి



మిరుదొడ్డి మండలం అందే ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న లింగంపేట గ్రామ నివాసి వ్యాసరేని రాములు మరణం ఉపాధ్యాయ లోకానికి విద్య వ్యవస్థకు, మరి ముఖ్యంగా కుటుంబంకు తీరనిలోటని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఏ రామచంద్రం అన్నారు. రాములు పార్థివ దేహం పై టీపీటీఎఫ్ జెండా నుంచి ఘన నివాళులు అర్పించారు. టీపీటీఎఫ్ శ్రేణులు వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాజులు, సుంచు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 21న భారత్ బంద్







నవతెలంగాణ-మిరుదొడ్డి

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ ఉపకులాలు ఈనెల 21న భారత్ బందును జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు దారస్వామి, మద్దెల చంద్రం సుదర్శన్‌లు అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రంలో ఈనెల 21 భారత్ బంద్ పిలుపునిచ్చామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాణిజ్య, వ్యాపార సంస్థ, యజమానులు, ఈ బందులో పాల్గొని సహకరించగలరని ప్రతి ఒక్క వ్యాపారులుకు ఎస్సీ, ఎస్టీ ఉప కులాలు వర్గీకరణ వ్యతిరేక పోరాట పక్షాన వర్గీకరణ వద్దు, కలిసి ఉంటేనే ముద్దు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న ఆశయాలను అప్పుడే మనము ముందుకు తీసుకుపోగలుగుతామని అన్నారు. కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 21న భారత్ బంద్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కులను కాలరాయనికి కొంతమంది వ్యక్తులు తమ రాజకీయ స్వాలభ్యం కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పేరుతో కోర్టుల్లో కేసులు వేసి రాష్ట్రాలకు వర్గీకరణలో హక్కులు కల్పించుటకై కోర్టు తీర్పులను తీసుకొస్తున్న రాజకీయ నాయకులకు తగిన గుణపాఠం చెప్పనీకై ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పోరాట సమితి గల్లి నుంచి ఢిల్లీ దాకా ఈనెల ఆగస్టు 21న భారత్ బందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల కమ్యూనిటీ సభ్యులు కుమార్ అస్కస్వామి, దార మల్లయ్య, సాయికుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ-రాయపోల్

ఎస్సీ, ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 21న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి సిద్దిపేట జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో భారత్ బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ ప్రసాదించిన హక్కులను కాపాడుకునేందుకు దేశంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఐక్యంగా కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో జరుగుతున్న ఈ పోరాటంలో మనమందరం భాగస్వాములు కావలసిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ పార్టీ, మోది సర్కారు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే ఎస్సీ, ఎస్టీలో వర్గీకరణ అంశమన్నారు. ఎస్సీ, ఎస్టీలను విభజించి పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఇదేన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. కాబట్టి ఎస్సీ, ఎస్టీ విద్యార్థిని, విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నేతలు, బీజేపీలో ఉన్న ఎస్సీ ఎస్టీ నేతలు, ఇతర పార్టీల నాయకులు అందరూ భారత్ బంద్‌లో పాల్గొని, విజయవంతం చేయలని పిలుపునిచ్చారు. ఎక్కడి వాళ్లు అక్కడే బంద్ పాటించాలని కోరుతున్నమన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనని వాళ్లు జాతి ద్రోహులుగా మిగిలి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మండల యాదగిరి, రాంపల్లి స్వామి, బ్యాగరి వంశీ, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఎస్సీ ఉప వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తూ అగస్టు 1న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 7 గురి ధర్మాసనం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ, కోర్టు నిర్ణయాలల్లో రాజకీయ జోక్యంను వ్యతిరేఖిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న దళిత సంఘాల భారత్ బంద్ పిలుపు మేరకు అగస్టు 21న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి జిల్లా కోకన్వీనర్ వెన్న రాజు అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈనెల 21న జరిగే భారత్ బంద్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21న జరిగే భారత్ బంద్‌కు వాణిజ్య రంగాలు, విద్యాసంస్థలు, ప్రయివేటు, ఆర్టీసి యాజమాన్యంలు సహకరించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వంలోని కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థం కోసం దళితులను విడదీసి పాలించాలనే కూలదాన్ని పెట్టుకున్నారన్నారు. మోసపూరిత కుట్రతోని న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించి పార్లమెంటులో చర్చ జరగకుండా తీర్మానం చేయడం సరైనది కాదని అన్నారు. మాలలు, మాల అనుబంధ కులాలు, ఎస్టీలు అందరం ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దళితుల్ని రాజ్యాధికారం నుంచి దూరం చేసే ఈ కుట్రలను తిప్పికొట్టాలని అంబేద్కర్ వాదులను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల బంద్ శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ టీసెల్ జిల్లా నాయకులు గుగులోత్ రాజు నాయక్, సంఘ బాధ్యులు బూరుగు కిష్ట స్వామి, సావుల రాజమౌళి, (న్యాయవాది), గుగులోత్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం



నవతెలంగాణ-మర్కుక్

రైతు రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైయిందని మర్కుక్ మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్, మాజీ జెడ్పీటీసీ యెంబరి రాంచంద్రం యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల నిధులు పూర్తిస్థాయి రుణమాఫీకి అవసరమని స్వయంగా సీఎం గతంలో ప్రకటించారని గుర్తు చేశారు. ఆగస్టు 15 లోపు పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తానని ప్రజలకు మాటిచ్చిన సీఎం అందులో కనీసం సగం మంది కూడా రుణమాఫీ చేయకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు . సీఎం చెప్పినట్టుగా కేవలం 22 లక్షల మంది రైతులకే ఇప్పటివరకు రుణమాఫీ జరిగిందని స్వయంగా సీఎం ప్రకటించారన్నారు. రైతులకు రూ.31 వేల కోట్లు రుణమాఫీకి అవసరమని పేర్కొన్న సీఎం కేవలం రూ.17934 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. ఇప్పటివరకు రూణమాఫీ కేవలం 47శాతం రుణమాఫీ మాత్రమే అని, ఇంకా 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికైనా అంకెల గారడి, అబద్దపు ప్రసంగాలు చేయకుండా పూర్తిస్థాయి రుణమాఫీ చేసి మిగతా 25 లక్షల మంది రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చెరువు తూమును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



మండల పరిధిలోని రావురూకుల గ్రామంలో పలుగుకుంట చెరువు తూమును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రావురూకుల గ్రామ రైతులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని 824 సర్వే నెంబర్‌లో ఉన్న పలుగు కుంట చెరువు కట్ట, తూమును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ కార్యాలయంలో, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అర్హులైన రైతులందరికి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంది

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్



నవతెలంగాణ-మర్కుక్

అర్హులైన రైతులందరికి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని రైతులెవ్వరు ఆందోళన చెంద్దోదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో రైతులకు రుణ మాఫీ రూ.లక్ష కూడా పూర్తి స్థాయిలో చేయలేని బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ విమర్శించే నైతిక హక్కులేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 9నెలల పాలనలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందన్నారు.100 శాతం రైతు రుణమాఫీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, సాంకేతిక తప్పిదాల వల్ల రుణమాఫీ వర్తించని రైతులను వెంటేసుకుని బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందన్నారు. రుణమాఫీ వర్తించని రైతులకు రుణమాఫీ వర్తించేల ప్రభుత్వం మార్గదర్శకాలను జారిచేస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్ముకుని రైతాంగం ఆందోళన చెంద్దోదన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాఖీ కట్టిన మంజుల రెడ్డి

- రక్షబంధన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి రాఖీ కట్టారు. దీంతో మంత్రి పొన్నం మంజుల రెడ్డితో పాటు రాష్ట్ర మహిళలకు రక్షబంధన్ శుభాకాంక్షలు తెలిపారు

మున్సిపల్ కమిషనర్‌గా ప్రేరణ



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రేరణ సోమవారం పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించారు. సిద్దిపేటలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ప్రసన్న రాణి బదిలీపై వరంగల్‌కు వెళ్లగా, సిద్దిపేట మున్సిపాలిటీలో డిఈగా పనిచేస్తున్న ప్రేరణకు ఇన్ని రోజులు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు పూర్తిస్థాయి కమిషనర్‌గా ఎవరూ రాకపోవడంతో, పూర్తి స్థాయి కమిషనర్‌గా బాధ్యతలను ప్రభుత్వం ఆమెకు అప్పగించింది.

రాఖీ పౌర్ణమి శోభాయాత్ర



నవతెలంగాణ-సిద్దిపేట

నూలు(జంధ్యాల)పౌర్ణమి సందర్భంగా పట్టణ పద్మశాలి సమాజం, యువజన విభాగం, పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షులు కాముని రాజేశం ఆధ్వర్యంలో పట్టణంలో రాఖీ పౌర్ణమి శోభాయాత్ర ఘనంగా జరిగింది. మార్కండేయ దేవాలయం నుంచి మొదలుకొని శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా చేనేతయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజం ప్రధాన కార్యదర్శి చేర్యాల మల్లికార్జున, ఉపాధ్యక్షులు పెద్ద అశోక్, శ్రీహరి, సహాయ కార్యదర్శి గుండు రవితేజ, కోశాధికారి ముదిగొండ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సిరిగాది బాల్రాజ్, కొండ బత్తిని రాజ్కోటి, తదితరులు పాల్గొన్నారు.

జపాన్ డిప్లొమా సర్టిఫికేట్ పొందిన కరాటే మాస్టర్స్



నవతెలంగాణ-సిద్దిపేట

జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా16వ నేషనల్ మాన్సూన్ సిజన్ కరాటే ప్రత్యేక శిక్షణ తరగతులు రాయపూర్, ఛత్తీస్ ఘడ్‌లో ఆగస్టు 16 నుంచి 18 వరకు జరిగగా, ఈ శిక్షణ తరగతులకు సిద్దిపేటకు చెందిన మాస్టర్స్ రామినీ భాగ్యరాజ్, రాచకొండ అంజనేయులు జపాన్ డిప్లొమా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. జపాన్ మాస్టర్ షిహాన్ టకుయా టనియామా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా చీఫ్ షిహన్ ఆనంద్ రత్న, సౌత్ ఇండియా చీఫ్ సెన్సయ్ రాపోలు సుదర్శన్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియంలో చేరేందుకు అవకాశం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో(బాలుర) ఇంటర్మీడియట్ మొదటి ఏడాది సీఈసీ ఇంగ్లీష్ మీడియంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.అశోక్ బాబు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు మంగళవారం (నేడు) ఒర్జినల్ టీసి, బోనఫైడ్, ఆదాయం, కులం ధ్రువీకరణ పత్రాలతోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకవచ్చి కళాశాలలో చేరవల్సిందిగా కోరారు.

మద్దూరులో భారీ వర్షం



నవతెలంగాణ-మద్దూరు

వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు కొంత ఉపశమనం ఇచ్చే విధంగా మద్దూరు మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఒక గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు వేసిన పంటలకు కొంత నీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనపూర్ గ్రామంలో శ్రావణ మాస బోనాలు





నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్ గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రావణ మాస పోచమ్మ బోనాలు నిర్వహించారు. భక్తి శ్రద్దలతో ఆదివారం రాత్రి గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బ్యాండ్ బాజాలు, ఒగ్గుడోలు, పోతురాజు నృత్యాలతో కన్నుల పండుగగా బోనాల పండుగ చేపట్టారు. శ్రావణ మాస పోచమ్మ బోనాలు సందర్భంగా రాగుల మల్లేశ్ మాట్లాడుతూ గ్రామదేవతలకు వండి పెట్టే భోజనమే బోనమని, బోనాన్ని గుడిలో అమ్మవారికి సమర్పించడంతో అది నైవేద్యం అవుతుందన్నారు. వర్షాలు బాగా పడాలని, గ్రామంలో పంటలు బాగా పండాలని, రుతుమార్పుల వల్ల వచ్చే అంటురోగాలు, అనారోగ్యాల పాలు కాకుండా ఉండాలని గ్రామ దేవతలకు మొక్కడం జరిగిందన్నారు. బోనాల పండుగకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జోగిని పావని బోనం ఎత్తి ఒగ్గు డోలు లతో నృత్యం, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు గ్రామస్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో బి. రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, విజయ్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

- షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి సిహెచ్ కవిత

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంల నుంచి సోమవారం అంబేద్కర్ విదేశీ విద్యనిది పథకం సంబందించి తెలంగాణ రాష్ట్ర మండలి ఎస్సీ కులాలకు చెందినా అర్హులైన విద్యార్థిని, విద్యార్థుల నుంచి ఉపకార వేతనములు కోరకు దరఖాస్తు చేసుకొనుటకు తేది: 2024 ఆగస్టు 14 నుంచి 2024 అక్టోబర్ 13 వరకు అవకాశం కల్పించారని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సిహెచ్. కవిత ఒక ప్రకటనలో తెలియజేసారు. కావున అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు అధికారిక వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పత్రికా ప్రకటనలో కోరారు.

ప్రజ్ఞాపూర్‌లో పడిగాపులు కాస్తున్న మహిళలు

- ఆర్టీసీ బస్సులు రాక ఇబ్బందులు
- రాఖీలు సమయానికి కట్టలేక పోయామని ఆవేదన
- సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టలేదు







నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఆర్టీసీ బస్సులు సమయానికి రాక రాఖీ పౌర్ణమి వేళ మహిళలు గమ్యాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సుమారు 200 మంది మహిళలు ఎక్కడ ఉన్న వారు అక్కడే నిలిచిపోయారు. వచ్చే బస్సులో ఎక్కుదామని ముందుకు వెళ్లి అందులో ఒక్కరు కూడా ఎక్కడానికి స్థలం లేక వెనుతిరిగారు. ఆర్టీసీ యాజమాన్యం పండుగల పూట ప్రత్యేక బస్సులు నడపాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి రాఖీ పౌర్ణమి ఒంటిగంట తర్వాత చేసుకోవాలని వాట్సాప్, యూట్యూబ్‌ల్లో చెక్కర్లు కొట్టాయి. ఆ పుకార్లు నమ్మిన ప్రజలు ఒంటిగంట వరకు రాఖీలు కట్టడంలో ఎక్కడో ఒకచోట కనిపించింది. దీంతో ఆర్టీసీ బస్సుల కొరత ఉండడంతో మహిళలు రాఖీలు కట్టేందుకు గమ్యస్థానాలు చేరుకోవడానికి గగనంగా మారింది. తోబుట్టువులు తోడబుట్టిన అన్నదమ్ములకు రాఖీలు కట్టాలి అంటే ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ఐదు గంటలు వేచి ఉండవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ సర్వీసులు ప్రారంభించి ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తుందని పలువురు మహిళలు మాట్లాడుకోవడం కనిపించింది. ఫ్రీ ప్రయాణమేమో గాని గమ్యస్థానాలకు చేరుకోవడానికి గతంలో కంటే ప్రస్తుతం గంటల సమయం పడుతుంది. ఇటీవల హైదరాబాదులో బోనాల పండుగకి ఇదే తంతు నెలకొంది. ఆ సమయంలో ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌లకి మొరపెట్టుకున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నదన్నట్లుగా నెలకొంది. ఇలాంటి సమయంలో ఆయా పరిధిలో డిపో మేనేజర్లు పై అధికారులకు సమాచారం ఇచ్చి ప్రత్యేక బస్సులను నడిపిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని మహిళలు కోరారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సమస్యలు లేకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి,సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు. ఇటీవల విడుదల చేసిన మినీ బస్సులు సరిపోవడం లేదని, మరిన్ని బస్సులు అందుబాటులోకి తేవాలని కోరారు. ఫ్రీ ప్రయాణంతో బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతు న్నారు. ఏ సమయంలో ప్రమాదం ఎక్కడ నుంచి వస్తుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు మేల్కొని ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు





నవతెలంగాణ-రాయపోల్

రాఖీ పౌర్ణమి వేడుకలు అన్న చెల్లెలు, అక్క తమ్ముల్లు తోబుట్టువులందరూ ఘనంగా నిర్వహించుకున్నారని రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు అన్నారు. సోమవారం రాయపోల్ కేంద్రంలో రాఖీ పండుగ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి వేడుకలలో తోబుట్టువులచే రక్షాబంధనాన్ని పొందడం సంప్రదాయంగా వస్తున్నది. భారతీయ కుటుంబ బాంధవ్యాలలోని మాధుర్యానికి ఇది చిహ్నం. అందులోను అక్కాచెల్లెళ్ళకు అన్నదమ్ముల అనురాగం జీవితాంతం ఉండవలసిన బంధమని గుర్తు చేసే పర్వదినం. ఇంటి ఆడపడుచును అప్యాయంగా చూసుకోవాలని దీని భావన. సోదరిచేత కట్టించుకున్న రక్షాబంధనం వారిద్దరి మధ్య ఇమిడి ఉన్న ప్రేమా, అనురాగాలకు ప్రతీక. ఒక రకంగా చెప్పాలంటే కుటుంబ సంబంధాలకు ఈ పండుగను ఓ గుర్తుగా చెప్పుకోవచ్చు. సోదరీమణులు తమ సోదరులను ఇంటికి ఆహ్వానించి, నొసట కుంకుమ దిద్ది, హారతినిచ్చి, వారి కుడి చేతికి రక్ష కడతారు. సోదరులు అక్షింతలు వేసి తమ సోదరిని ఆశీర్వదించి ఆమెకు కానుకలు అందిస్తారు. ఎలాంటి ఆపద వచ్చినా ఒకరినొకరు అండగా ఉంటామని, రక్షణగా నిలుస్తామని ప్రతిన పూనే సమైక్య భావ నిలయమే ఈ పండుగ. సొంత సోదరులు లేకపోయినా బంధువులలో సోదర వరుస అయ్యే వారికి, సోదర భావంతో చూసేవారికి రాఖీ కట్ట వచ్చు. రాఖీ పండగకు ధనిక, పేద అనే బేధ భావం లేదు. అందరూ సమానమే. ప్రేమ, ఆప్యాయత ఉంటే చాలు. సోదరులు ఇచ్చిన కానుకలను ఎంతో సంతోషంగా స్వీకరించి వారి మంచిని కోరుకుంటారు. ప్రతి రోజూ పని ఒత్తిడిలో బిజీగా గడిపే అన్న చెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల ఈ రోజు ఒక దగ్గరకు చేరుకుంటారు. ఇల్లంతా సందడితో నింపి సంబరంగా రాఖీ పౌర్ణమిని నిర్వహించుకుంటారు.

నవతెలంగాణ-గజ్వేల్

సోమవారం రాఖీ పండుగ పురస్కరించుకొని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళికి రాఖీ కట్టి మిఠాయి తినిపించి ఆయన తోబుట్టువులు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపి, స్వగృహంలో నిరాడబరంగా రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ అత్యంత ప్రేమ అభిమానాలతో అక్కాచెల్లెళ్లు అన్న తమ్ముళ్లు సంతోషంగా నిర్వహించుకునే పండుగ రాఖీ పండుగని అన్నారు. అందరూ ప్రేమభావంతో ఉంటూ సోదర భావం పెంపొందాలని అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎంపీపీ దాసరి అమరావతి సైతం చైర్మెన్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

గజ్వేల్ మాజీ చైర్మెన్

రాఖీ పండుగ సందర్భంగా సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్‌కు గజ్వేల్ ఎంపీపీ దాసరి అమరావతి శ్యామ్ మనోహర్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా భాస్కర్ అన్నకు తాను రాఖీ పండుగ రోజు శుభాకాంక్షలు తెలుపుతానని పేర్కొన్నారు. తాము రాజకీయాల్లో వచ్చిన రోజు నుంచి చెల్లెమ్మగా భావించి ఎంతో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ మాజీ ఎంపీపీ అమరావతి చెల్లెమ్మగా దశాబ్దాల కాలంగా పరిచయమని ప్రతి ఏటా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతుందని అన్నారు. చెల్లమ్మ అమరావతి పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

గజ్వేల్‌లోని ప్రముఖ విద్యాసంస్థల యజమానులు

అన్నాచెల్లెళ్లు, అక్క తమ్ముళ్లకు ప్రతీకగా నిలుస్తున్న రాఖీ పండుగ సందర్భంగా సోమవారం గజ్వేల్ పట్టణంలో ప్రముఖ విద్యాసంస్థల యజమానులు జీడీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి కాగా తమ్ముడు సాయి జీడీఆర్ ప్రిన్సిపాల్ సోమేశ్వర్ రెడ్డి ఇద్దరూ రాఖీ పండుగ రోజు కలుసుకొని తమ్ముడి ఇంటికి వచ్చి రాఖీ కట్టి విజయలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. ఆప్యాయత అనురాగం పలు కుటుంబాల్లో రాఖీ పండుగ సందర్భంగా నెలకొన్నది. అంతేకాకుండా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో రాఖీ పండుగ సందడి జరిగింది. ప్రతి ఇంటికి ఆడపడుచు వచ్చి రాఖీ కట్టి సోదరులకు తీపిని తినిపించారు. అక్క తమ్ముడు అన్నా చెల్లెళ్లకు అనురాగంగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా పలువురు సమీప బంధువులు ఇతర బంధువులు శుభాకాంక్షలు తెలుజేసుకున్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

ప్రేమ, అనురాగాలకి, ఆప్యాయతలకు ప్రతిరూపమైనా రాఖి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్ల మధ్య రాఖీ బంధం మరింత ఆప్యాయతను పెంచింది. తీరొక రాఖీలను తమ్ముళ్లకు, అన్నలకు కట్టి, స్వీట్లు తినిపించారు. శక్తి కొలది ఆడపడుచులకు కట్నాలు పెట్టారు.

కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో

రక్షాబంధన్ పండుగ సందర్భంగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణకి మహిళా కాంగ్రెస్ నాయకురాలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నూతన పథకాలను తీసుకువస్తున్నారని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం మహిళా శక్తి పథకం తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్ నివాసంలో..

రాఖీ పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు తమ నివాసంలో ఉన్న చెట్టుకు ఆవు పేడతో తయారుచేసిన రాఖీని కట్టి, వృక్ష బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. చెట్లు మానవ మనుగడకు అతి ముఖ్యమని, ప్రజలందరూ తమ పుట్టినరోజు, పెళ్ళిరోజులకు మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ కడవేరుగు రాజనర్సు ఉన్నారు.

నవతెలంగాణ-కొండపాక

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతికైనా రక్షాబంధన్ పండుగను మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరులకు అక్క చెల్లెళ్ల రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

మాజీ మంత్రికి, దుబ్బాక ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన సద్గుణ

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ మాజీ డైరెక్టర్ కోల సద్గుణ మాజీ మంత్రి హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-మర్కుక్

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. తమ పేగు బంధం కలకాలం నిలువాలని కోరుకుంటూ సోదరుడికి సోదరి కట్టే కంకణమే రక్షా బంధన్. సోమవారం రాఖీ పౌర్ణమిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. బంధువులు, కుటుంబ సభ్యులతో ఇంటింటా సందడిగా నిర్వహించుకున్నారు. రాఖీలు, స్వీట్లు కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మండల ప్రజలకు మర్కుక్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీతో అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధం మరింత బలోపేతం కావాలని, ప్రజల మధ్య సోదరభావం పెంపొందాలని వారు ఆకాంక్షించారు. మండలంలోని అన్ని గ్రామాలలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా రక్షబంధన్ వేడుకలను నిర్వహించినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. రక్షబంధన్ యొక్క విశిష్టతను గురించి తెలుగు ఉపాధ్యాయులు విజయ్ కుమార్, ఝాన్సీ విద్యార్థులకు తెలియజేసారు. విద్యాలయంలో బాలికలు, బాలూరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచారు. అలాగే విద్యాలయంలో మహిళ ఉపాధ్యాయులు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పుడు సోదర భావంతో తోటి విద్యార్థులతో మెలగాలని సూచించారు. రాఖీ పండగ విశిష్టతను గురించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో రమేష్, శేషు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో రాఖీ పౌర్ణమి పండుగ వేడుకలు తోబుట్టువులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నాతమ్ముళ్లకు అక్కాచెల్లెలు తమ తోబుట్టువు బంధావ్యానికి ప్రతీకగా రాఖీ పండుగను సంతోషంగా నిర్వహించుకున్నారు.

నవతెలంగాణ-నంగునూరు

సోదర, సోదరీమణులు మధ్య అనురాగబంధాన్ని ఆవిష్కరించే పండుగ రాఖీ పౌర్ణమి వేడుకలు నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. కులమాతాలకు అతీతంగా సోదరభావాన్ని, ఏకత్వ స్పూర్తిని చాటి చెప్పే రక్షాబంధన్ వేడుకలు ప్రతి ఇంట్లో జరిగాయి. ఒకరినొకరు పలకరించుకుంటూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్క, చెల్లి, అన్న, తమ్ముడు అనుబంధం రక్షాబంధన్ గా చెప్పుకోవచ్చు. పుట్టింటి నుంచి అత్తారింటికి వెళ్లిన అక్క చెల్లెలు పుట్టింట్లో అన్నదమ్ములకు నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష అని ఉద్దేశంతో రాఖీ పండుగ నిర్వహించుకుంటారు. కులమతాలకతీతంగా ఈ యొక్క పండగ పర్వదినంగా చెప్పుకోవచ్చు. మిరుదొడ్డి మండలంలోని పలు గ్రామాల్లో రక్షాబంధన్ అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. అక్క చెల్లెలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. మిరుదొడ్డి మండలంలోని లింగుపల్లి, చెప్యాలా, అలవాల తోపాటు అన్ని గ్రామాల్లో యొక్క పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

నవతెలంగాణ-ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని అన్నకు చెల్లి, అక్క తమ్ముళ్లకు రాఖీలు కట్టుకొని స్వీట్ తినిపించుకుంటూ రాఖీ పండుగ సందడి లాగా చేసుకున్నారు.

చెరువు, కుంటలపై ప్రజల నుంచి అభ్యంతరలను స్వీకరించాలి

- హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ఎచ్ఎండీఎ పరిధిలోని జిల్లాలో గల మర్కుక్, ములుగు, వర్గల్ మండలాల్లో ఉన్న చెరువులు, కుంటలకు సంభందించిన భూ విస్తీర్ణం పైన ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ ప్రక్రియ వేగవంతం, ఆఖరి నోటిఫికేషన్ జారి చేయడంలో సమస్యల గుర్చి హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సమీక్ష నిర్వహించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హెచ్ఎండీఏ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, ఆయా మండల రెవెన్యూ భూ సర్వే నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హెచ్ఎండీఏ కమిషనర్ మాట్లాడుతూ ఎచ్ఎండీఏ పరిధి జిల్లాలోని మండలాల్లో సర్వే చేసి గుర్తించిన చెరువులు, కుంటల భూ విస్తీర్ణం ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు ప్రీమినరీ నోటిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలి. అలాగే ఆఖరు నోటిఫికే షన్‌లో సమస్యలు రాకుండా నీటిపారుదల, రెవెన్యూ, భూ సర్వే, హిస్టారికల్ సాటిలైట్ వ్యూ మ్యాప్‌లను సేకరించి పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేసి ఈ ప్రక్రియ వారంలో పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్, ఎడి సర్వేలాండ్ వినయ్ కూమార్, ఆయా మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులు, పాల్గొన్నారు.





ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాస్‌రెడ్డి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ - కొమురవెల్లి

సైబర్ నేరాలు, గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కిష్టంపేటలో గ్రామస్తులకు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామస్తుల సహకారంతో గ్రామంలోని కూడళ్లలో, దేవాలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

